


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 347, పేజీలు - 08

ఆదివారం, జూన్ 7, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

# హిట్లర్ స్ఫూర్తితోనే హైడ్రా

## - దక్షిణాదికి బీజేపీ అన్యాయం - రేవంత్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బెంగళూరులో ఓ మీడియా సంస్థ నిర్వహించిన సదస్సులో "బై, ఫర్, అండ్ ఆఫ్ ది పీపుల్: గుడ్ గవర్నెన్స్ ఫర్ తెలంగాణ" అనే అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగంలో కీలక అంశాలు వైరల్ అవుతున్నాయి. దేశంలో కేటాయించే అత్యున్నత పదవుల్లో దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయాన్ని, వివక్షను ఆయన నిలదీస్తూ తీవ్రవ్యాఖ్యలు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దక్షిణాదిని కేవలం పన్నులు వసూలు చేసే ప్రాంతంగానే చూస్తోందని, కీలక నిర్ణయాత్మక పదవులన్నీ ఉత్తరాది నేతలకే కట్టబెడుతున్నారని ఆయన విమర్శించారు.

### కీలక పదవులన్నీ ఉత్తరాదికే

కేంద్ర ప్రభుత్వంలోని అగ్రశ్రేణి పదవులైన ప్రధానమంత్రి, రాష్ట్రపతి, హోంమంత్రి, రక్షణమంత్రి వంటి అత్యంత కీలకమైన పోర్ట్‌ఫోలియోలన్నీ ఉత్తరాది నేతలకే దక్కాయని రేవంత్ రెడ్డి లెక్కలతో సహా ఎండగట్టారు. కేంద్రానికి అత్యధికంగా పన్నులు చెల్లిస్తున్న దక్షిణాది రాష్ట్రాలకు జాతీయ స్థాయిలో తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. మేము పన్నులు చెల్లిస్తూ, ఢిల్లీకి సెల్యూట్ చేస్తూ.. దేశంలో రెండో శ్రేణి పౌరులుగా బతకాలని అనుకోవడం లేదు అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు దక్షిణాది ఆత్మగౌరవ వాదాన్ని బలంగా వినిపించాయి.

### చైనాను రీప్లేస్ చేసేలా తెలంగాణ

పెట్టుబడుల ఆకర్షణ , గుజరాత్ మోడల్‌పై కూడా సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గుజరాత్ తనంతట తానుగా పెట్టుబడులను ఆకర్షించడం లేదు, మనల్ని బలవంతంగా అక్కడ పెట్టుబడులు పెట్టేలా చేస్తున్నారు అని విమర్శించారు. గత 20 ఏళ్లుగా కేవలం ఒకే ఒక్క రాయబారి గుజరాత్ కోసం పని చేస్తున్నారని మండిపడ్డారు. తన పోటీ మహారాష్ట్ర , ఇతర భారతీయ రాష్ట్రాలతో కాదని.. చైనా, జపాన్, దక్షిణ కొరియా వంటి అంతర్జాతీయ దేశాలతోనే తాను పోటీ పడుతున్నట్లు ప్రకటించారు. తెలంగాణను చైనా ం 1 ప్రత్యామ్నాయంగా మార్చి, అంతర్జాతీయ స్థాయిలో చైనాను రీప్లేస్ చేయడమే తన నినాదమని స్పష్టం చేశారు.

### హిట్లర్ స్ఫూర్తితో హైడ్రా

రాష్ట్రంలో వివాదాస్పద హైడ్రా నిర్ణయంపై రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ధనికులు జలవనరులను,



చెరువులను కబ్జా చేస్తుంటే చూస్తూ ఊరుకోలేకనే 'హైడ్రా'ను ఏర్పాటు చేశానని, హిట్లర్‌కు ఇష్టమైన పదం నుండి స్ఫూర్తి పొంది ఈ పేరు పెట్టానని తెలిపారు. ఈ విభాగంలో 3,000 మంది రిటైర్డ్ ఆర్మీ సిబ్బందిని

2లో..

# జంతర్ మంతర్‌ను కదిలించిన యువత

## - కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో వేలాదిగా తరలివచ్చిన విద్యార్థులు, యువకులు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) నీట్-యూజీ 2026 పేపర్ లీక్, సీబీఎస్ఈ ఆన్-స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) మూల్యాంకనంలో జరిగిన అవకతవకలపై దేశ రాజధాని ఢిల్లీ అట్టుడికింది. 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఆధ్వర్యంలో నేడు జంతర్ మంతర్ వద్ద వేలాది మంది యువత భారీ నిరసన చేపట్టారు. అయితే, ఈ నిరసన పూర్తయిన వెంటనే, సంస్థ నిర్వాహకులపై దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారంటూ ఫిర్యాదు దాఖలైంది. సీజేపీ వ్యవస్థాపకుడు, బోస్టన్ యూనివర్సిటీ విద్యార్థి అయిన అభిజీత్ దీప్కే నేతృత్వంలో ఈ నిరసన జరిగింది. ఢిల్లీ పోలీసుల అనుమతితోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో వేలాది మంది పాఠశాల, కళాశాల విద్యార్థులతో పాటు యువ వృత్తి నిపుణులు పాల్గొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు, బ్యానర్లతో నినాదాలు చేశారు. ప్రముఖ పర్యావరణవేత్త

2లో..



# సర్వే చేస్తాం...

## తేడాగా ఉన్నవాళ్లను వదిలించుకుంటాం

### - క్యాడర్ కు చంద్రబాబు క్లారిటీ



అమరావతి (ప్రశ్న న్యూస్) తెలుగుదేశం పార్టీలో ఇకపై పనితీరే ప్రామాణికమని, తప్పులు చేసే వారిని, తేడాగా వ్యవహరించే వారిని వదిలించుకుంటానని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. పార్టీ పదవుల నుంచి ఎన్నికల టికెట్ల కేటాయింపు వరకు నిరంతరం సర్వేలు చేయిస్తానని, ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగానే నిర్ణయాలు ఉంటాయని ఆయన తేల్చి చెప్పారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శిక్షణ పొందుతున్న క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో నిర్వహించిన 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో ఆయన పాల్గొని, పార్టీ భవిష్యత్ వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ఇకపై పార్టీకి ఓటమి లేదు, రాదు. ఆ స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రజలతో మంచిగా ఉంటున్నాం, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తున్నాం, సంక్షేమం-అభివృద్ధి

2లో..

# ఐఎండీ షాకింగ్ అలెర్ట్

## - ఈసారి 90 శాతం కంటే తక్కువ వర్షపాతం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారతదేశ ఆర్థిక వ్యవస్థకు, వ్యవసాయ రంగానికి పట్టుకొమ్మ లాంటి నైరుతి రుతుపవనాలపై పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడుతున్న 'ఎల్ నినో' తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ

2లో..

# పవన్ ఫామ్ హౌస్ కబ్జానే

## - కవిత సంచలన వ్యాఖ్యలు

- కోటి చెరువు శిఖం భూమిని పవన్ కబ్జా చేశారన్న కవిత
- తెలంగాణ ప్రభుత్వానికి భూమిని అప్పగించాలని డిమాండ్
- తెలంగాణ కచ్చితంగా తమ జాగీరేనని వ్యాఖ్య



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ శివార్లలోని జన్వాడ ప్రాంతంలో ఉన్న కోడి చెరువు కబ్జా ఆరోపణలను ప్రస్తావిస్తూ ఆమె పవన్ కల్యాణ్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జూబ్లీహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. పవన్ గతంలో చేసిన సవాల్‌ను గుర్తు చేస్తూ భూముల్ని తిరిగి ఇవ్వాలన్నారు. పవన్ కల్యాణ్ తాను చెరువును ఆక్రమించలేదని, ఒకవేళ అది గనుక రుజువైతే వెంటనే ఆ భూమిని తెలంగాణ ప్రభుత్వానికి రాసిస్తానని ప్రగల్భాలు పలికారు.

2లో..

# జీరో లిక్విడ్ డిశ్చార్జి పంచాయతీలతో గోదావరి పుష్కరాలకు మరింత శోభ

## - డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



అమరావతి (ప్రశ్న న్యూస్) గోదావరి పుష్కరాలను స్వచ్ఛంగా, శుభ్రంగా నిర్వహించాలన్నది కూటమి ప్రభుత్వ తపన. ఇందుకు అనుగుణంగా గోదావరి పుష్కరాలకు ఆతిథ్యం ఇచ్చే 268 గ్రామ పంచాయతీలను మోడల్ పంచాయతీలుగా తీర్చిదిద్దుతాం. పంచాయతీల నుంచి వచ్చే మురుగు నీరు చుక్క కూడా గోదావరిలోకి కలవడకుండా చర్యలు తీసుకోవాలి. జీరో లిక్విడ్ డిశ్చార్జి పంచాయతీలుగా తీర్చేదిద్దే బాధ్యతను జిల్లా కలెక్టర్లు తీసుకోవాలి. ఇందుకు పక్కా ప్రణాళికను సిద్ధం చేయాలి'అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. గోదావరి మోడల్ పుష్కర్ పంచాయతీ ప్రణాళికపై శనివారం గోదావరి పుష్కరాలకు సంబంధించిన జిల్లా కలెక్టర్లతో,

2లో..

# మహిళలకు అండగా తెలంగాణ పోలీస్

## - 'స్త్రీ రైడ్' ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో మహిళలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడంతో పాటు వారికి ఆత్మవిశ్వాసం, సమాజంలో భద్రతను పెంచడమే లక్ష్యంగా తెలంగాణ పోలీస్ శాఖ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తెలంగాణ విమెన్ సేఫ్టీ వింగ్, తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ సంయుక్తంగా రూపొందించిన స్త్రీ రైడ్ ప్రాజెక్టును హైదరాబాద్‌లో డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు. రవాణా, డెలివరీ రంగాల్లో మహిళలు స్వయం ఉపాధి సాధించేలా ప్రోత్సహించేందుకు ఈ-బైక్స్, ఈ-ఆటోలను జెండా ఊపి సీవీ ఆనంద్ మొదలుపెట్టారు. ఇక ఈ కార్యక్రమంలోని తొలి విడతలో భాగంగా 55 మంది మహిళలకు స్త్రీ రైడర్లుగా అవకాశం కల్పించారు. ఈ 55 మందికి అంబర్‌పేట పోలీస్ లైన్స్‌లో టూ వీలర్, త్రీ వీలర్ డ్రైవింగ్‌లో ట్రైనింగ్ ఇచ్చారు.

2లో..

# చంద్రబాబుతో రేవంత్ రెడ్డి కుమ్మక్కయ్యారు

## - సాగునీటి ప్రాజెక్టులపై తమను విమర్శించే హక్కు రేవంత్ కు లేదన్న హరీశ్

## - కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరుకు చేసిందేమీ లేదని వ్యాఖ్య



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పాలమూరు ప్రాజెక్టు సందర్శనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విమర్శలకు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు గట్టి కౌంటర్ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డివి "మతిలేని మాటలు" అంటూ ఆయన తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. ఓ న్యూస్ ఛానల్‌తో మాట్లాడిన హరీశ్ రావు, బీఆర్ఎస్ చేపట్టబోయే పాదయాత్ర భయంతోనే సీఎం రేవంత్ రెడ్డికి నిద్ర కరువైందని, సాగునీటి ప్రాజెక్టులపై తమను విమర్శించే నైతిక హక్కు ఆయనకు లేదని స్పష్టం చేశారు. "అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరుకు చేసిందేమీ లేదు. సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుతో కుమ్మక్కై తెలంగాణకు తీవ్ర ద్రోహం చేస్తున్నారు. అందుకే ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ 75 శాతం కృష్ణా నీటిని వాడుకుంటే, తెలంగాణ కేవలం

2లో..

# అన్నామలై 'వియ్ ది లీడర్స్' పేరుతో కొత్త రాజకీయ ఉద్యమం

## - 24 గంటల్లో 14 లక్షల మంది చేరిక!



చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఐపీఎస్ అధికారి కె. అన్నామలై బీజేపీకి రాజీనామా చేసి సంచలనం సృష్టించారు. జూన్ 5న పార్టీ ఆయన రాజీనామాకు ఆమోదం తెలిపిందే. వెంటనే ఆయన 'వియ్ ది లీడర్స్' పేరుతో నూతన రాజకీయ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ ఉద్యమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ప్రారంభించిన కేవలం 24 గంటల వ్యవధిలోనే సుమారు 14 లక్షల మంది ఈ ఉద్యమంలో భాగస్వామ్యం కావడం గమనార్హం. గత కొంతకాలంగా పార్టీ రాష్ట్ర వ్యూహాల విషయంలో అధిష్ఠానంతో విభేదిస్తున్న

2లో..

# త్వరలోనే పోలీస్ ఉద్యోగాల భర్తీ

## - సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ పోలీస్ శాఖలో త్వరలోనే ఖాళీల భర్తీ ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా ఒక కీలక ప్రకటన చేశారు. తొందర్లోనే 5 వేల పోలీస్ ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. తాజాగా ఓ జాతీయ మీడియా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్ రెడ్డి తెలంగాణలో నిరుద్యోగ సమస్యను తీర్చేందుకు తమ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతోందని వివరించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే ఏకంగా 67760 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చినట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో తెలంగాణ రాష్ట్రాన్ని పాలించిన

2లో..

# హిట్లర్ స్ఫూర్తితోనే హైడ్రా

నియమించానని, ఇప్పుడు చెరువులను ఆక్రమించడానికి ఎవరూ సాహసించలేరని చెప్పారు. అలాగే యువతను పీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించడానికి దేశంలోనే అత్యుత్తమమైన 'ఈగిల్ ఫోర్స్' ను రంగంలోకి దించామన్నారు.మహిళా సాధికారత, విద్యారంగంలో తమ ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాలను రేవంత్ రెడ్డి వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాలపై 'జీరో టాక్స్' విధానం వల్ల తెలంగాణ ప్రభుత్వం రూ. 2,000 కోట్ల ఆదాయాన్ని కోల్పోతున్నప్పటికీ పర్యావరణం కోసం వెనకడుగు వేయలేదన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల్లో 67 లక్షల మంది సభ్యులు ఉన్నారని, వారికి వడ్డీ లేని రుణాలు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, సోలార్ ప్యానెల్ యూనిట్లు, పెట్రోల్ బంకుల నిర్వహణ బాధ్యతలు అప్పగించామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వైట్ కాలర్ ఉద్యోగాలను రీప్లేస్ చేస్తున్న తరుణంలో, తాము ఏర్పాటు చేసిన స్కిల్స్ యూనివర్సిటీ కి కార్పొరేట్ సీఈఓలనే బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా నియమించామని, వారే సిలబస్ నిర్ణయించి ఉద్యోగాలు కల్పిస్తారని రేవంత్ రెడ్డి ఈ సదస్సులో వెల్లడించారు.

# సర్వే చేస్తాం...

రెండు కళ్లుగా పనిచేస్తున్నాం. అన్నింటికీ మించి ఆత్మవిమర్శ చేసుకుంటున్నాం. అందుకే ఓటమి మన దరికి చేరదు. రాష్ట్రం, పార్టీ శ్రేయస్సు కోసం తప్పులు చేసిన వారిని, తేడాగా ఉన్నవారిని వదిలించుకోవడానికి వెనుకాడను" అని స్పష్టం చేశారు. గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచిస్తూ, మంగళగిరి నియోజకవర్గాన్ని ఉదాహరణగా చూపారు. "మంగళగిరిలో పార్టీ గెలిచి చాలా కాలమైంది. 2019లో లోకేష్ ఓడినా పట్టు వదలకుండా పనిచేసి, 2024లో అద్భుత విజయం సాధించారు. ఇప్పుడు ఆ నియోజకవర్గాన్ని టీడీపీకి కంచుకోటగా మార్చారు. అందరూ లోకేష్‌లా పనిచేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. మంచి సంకల్పంతో పనిచేస్తే దానికి తగ్గ వాతావరణం దానంతట అదే ఏర్పడుతుందని, 'ది సీక్రెట్' పుస్తకాన్ని ప్రతి కార్యకర్తా చదవాలని సూచించారు.

### 'గొడ్డలి పార్టీ' చేతులెత్తేసింది

గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "మద్యపానం నిషేధం, సీపీఎస్ రద్దు, జాబ్ క్యాలెండర్ వంటి హామీలిచ్చి 'గొడ్డలి పార్టీ' చేతులెత్తేసింది. వారు చెప్పినవి చేయకపోగా, మేం నిర్వహిస్తున్న డీఎస్సీ-2025పై బురదజల్లారు. వివేకా హత్య విషయంలో ఎలా దుష్ప్రచారం చేసి లబ్ధి పొందారో, డీఎస్సీ విషయంలోనూ అదే ప్రయత్నం చేశారు. కానీ మేం ఆధారాలతో సహా కౌంటర్ ఇవ్వడంతో వారు డిఫెన్స్‌లో పడ్డారు. ఫేక్ రాజకీయాలు చేయడమే గొడ్డలి పార్టీ సిద్ధాంతం" అని ఆయన విమర్శించారు. తాము అధికారంలో ఉన్నందున సహనంతో ఉంటామని, అయితే ప్రతిపక్షం ఆగడాలు శ్రుతి మించితే సహించేది లేదని హెచ్చరించారు. కూటమి ధర్మాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. "కూటమిగా వెళ్లాం కాబట్టే 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో గెలిచాం. ఓట్లు చీలకూడదనే బీజేపీతో పొత్తులో ఉన్నా టీడీపీతో కలుస్తానని పవన్ కల్యాణ్ చెప్పారు. ఈ స్ఫూర్తిని క్షేత్రస్థాయిలో కార్యకర్తలు కొనసాగించాలి" అని సూచించారు. "యుద్ధాన్ని గెలిపించే బాధ్యత నాది, నాతో పాటు అలుపెరగకుండా యుద్ధం చేసే బాధ్యత మీది. రాష్ట్రంలోని ప్రతి బూత్‌లో గతానికి మించి ఓట్లు రావాలి" అని శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను గడప గడపకు వెళ్లి వివరించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని ప్రజలకు గుర్తు చేయాలని ఆదేశించారు.

# జంతర్ మంతర్‌ను కదిలించిన యువత

సోనమ్ వాంగ్‌చుక్ కూడా ఈ నిరసనకు హాజరై తన మద్దతును ప్రకటించారు. ఈ నిరసన తర్వాత అభిజీత్ దీప్కేపై కేసు నమోదైంది. అతడు అమెరికా నుంచి తిరిగి వచ్చిన వెంటనే ఈ నిరసనను నిర్వహించడంపై పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. విదేశీ నిధులతోనే ఈ నిరసనను చేపట్టారని, దీని వెనుక దేశ వ్యతిరేక కార్యకలాపాలు ఉన్నాయని ఫిర్యాదులో ఆరోపించారు. గత నెలలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ కోర్టు విచారణ సందర్భంగా యువతలో కొందరిని ఉద్దేశించి 'బొద్దింకలు', 'పరాన్నజీవులు' అని సంబోధించారు. ఈ వ్యాఖ్యలకు వ్యంగ్యాస్త్రంగా అభిజీత్ దీప్కే 'కాక్రోచ్ జనతా పార్టీ'ని సోషల్ మీడియాలో ప్రారంభించారు. అనతికాలంలోనే ఈ సంస్థకు 22 మిలియన్ల మంది ఫాలోవర్లు చేరారు. యువత సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ ఉద్యమం సాగుతోంది. నిరసన నేపథ్యంలో ఢిల్లీ వ్యాప్తంగా వెయ్యి మందికి పైగా పోలీసులతో భద్రతను కట్టుదిట్టం చేశారు. సరిహద్దులు, విమానాశ్రయం వద్ద నిఘా పెంచడంతో పాటు సోషల్ మీడియా, క్యాబ్ సర్వీసులపై కూడా అధికారులు దృష్టి సారించారు.

# ఐఎండీ షాకింగ్ అలెర్ట్

హెచ్చరించింది. 2026 సంవత్సరానికి సంబంధించిన రుతుపవనాల అంచనాలను ఐఎండీ సవరించింది. ఈ ఏడాది దీర్ఘకాలిక సగటు వర్షపాతంలో కేవలం 90 శాతం మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని, అంటే సాధారణం కంటే తక్కువ వర్షాలు కురుస్తాయని స్పష్టం చేసింది. గత పదేళ్ల కాలంలో దేశంలోనే అత్యంత బలహీనమైన వర్ష సూచన ఇదే కావడం గమనార్హం. ఈసారి నైరుతి రుతుపవనాలు జూన్ 4న ఆలస్యంగా కేరళ తీరాన్ని తాకాయి. దేశవ్యాప్తంగా 70 శాతానికి పైగా వర్షపాతాన్ని అందిస్తూ, కోట్ల మంది రైతుల జీవనాధారంగా ఉన్న రుతుపవనాలు బలహీనపడటం వ్యవసాయ రంగంతో పాటు ఆహార భద్రత, భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. పసిఫిక్ మహాసముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడాన్ని 'ఎల్ నినో' గా పిలుస్తారు. దీనివల్ల వాతావరణ వ్యవస్థ దెబ్బతిని, భారత ఉపఖండం వైపు వచ్చే రుతుపవన గాలులు బలహీనపడతాయి. జూన్ – ఆగస్టు 2026 మధ్య ఎల్ నినో ఏర్పడే అవకాశం 80 శాతం ఉండగా, నవంబర్ నాటికి అది 90 శాతానికి పెరుగుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ కూడా ధ్రువీకరించింది.

### ప్రాంతీయ ప్రభావాలు - పంటలపై ముప్పు

ఐఎండీ అంచనాల ప్రకారం.. దేశంలోని మధ్య, దక్షిణ భారత (పెనిన్సులర్) ప్రాంతాలలో వర్షాలు బాగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. అయితే వాయవ్య ప్రాంతాల్లో మాత్రం సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా జూన్ నెలలో దేశంలోని చాలా ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవచ్చు. ఎల్ నినో వచ్చిన ప్రతిసారీ తీవ్ర కరవు రాకపోయినప్పటికీ, చారిత్రక రికార్డుల ప్రకారం వర్షపాతం గణనీయంగా తగ్గుతుంది. దీనివల్ల ఖరీఫ్ సీజన్ ప్రధాన పంటలైన వరి, పప్పుధాన్యాల సాగు ఆలస్యం కావడమే కాకుండా, దిగుబడి తగ్గి మార్కెట్లో నిత్యావసరాల ధరలు పెరిగే ద్రవ్యోల్బణ ముప్పు పొంచి ఉంది.

### ఆశలు రేపుతున్న ఐవోడీ

గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగిన లా నినా పరిస్థితులు ముగిసి, భూతాపం కారణంగా వాతావరణంలో తీవ్ర మార్పులు వస్తున్నాయి. అయితే, హిందూ మహాసముద్రంలో ఏర్పడే 'పాజిటివ్ ఇండియన్ ఓషన్ డైపోల్' కాస్త బలంగా ఉంటే.. అది ఎల్ నినో ప్రభావాన్ని కొంతవరకు అడ్డుకుని వర్షాలు కురిపించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. కానీ దీని తీవ్రతపై ఇంకా పూర్తి స్పష్టత రాలేదు. అప్పుడే దేశంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో రైతాంగంలో ఆందోళన మొదలైంది. ప్రభుత్వం కూడా ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి సంరక్షణ చర్యలపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

# అన్నామలై 'వియ్ ది లీడర్స్' పేరుతో కొత్త రాజకీయ ఉద్యమం

అన్నామలై, చివరకు పార్టీని వీడాలని నిర్ణయించుకున్నారు. తన రాజీనామా లేఖను బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌కు పంపగా, ఆయన దానిని నిన్న ఆమోదించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పట్ల తనకు అమితమైన గౌరవం ఉందని, అయితే పార్టీని మరింత ఇబ్బంది పెట్టడం ఇష్టం లేకనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అన్నామలై తన లేఖలో పేర్కొన్నారు. 'సింగం'గా గుర్తింపు పొందిన ఆయన, 2020లో సివిల్ సర్వీసెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు.

రాజకీయల్లోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే, 37 ఏళ్ల వయసులో రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి రికార్డు సృష్టించారు.'వియ్ ది లీడర్స్' ఉద్యమం ద్వారా తమిళనాడులో వారసత్వ, వ్యక్తిపూజ రాజకీయాలకు స్వస్తి పలికి, సమర్థవంతమైన ప్రత్యామ్నాయాన్ని తీసుకురావడమే తన లక్ష్యమని అన్నామలై ప్రకటించారు.

విద్య, ఆరోగ్యం, యువతకు నాయకత్వ అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారిస్తామని తెలిపారు. దివంగత రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాల స్ఫూర్తితో ఈ ఉద్యమాన్ని నిర్మిస్తామని వెల్లడించారు. అన్నామలైకి మద్దతుగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరు నాగరాజన్‌తో సహా పలువురు కీలక నేతలు కూడా బీజేపీని వీడారు. ఈ నూతన ఉద్యమం రానున్న లోక్‌సభ ఎన్నికల నాటికి పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా ఆవిర్భవించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# పవన్ ఫామ్ హౌస్ కబ్జానే

ఇప్పుడు ఇరిగేషన్ శాఖకు సంబంధించిన అధికారిక రికార్డులను పరిశీలిస్తే అది స్పష్టంగా చెరువు శిఖం భూమి అని తేలిపోయింది అని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పవన్ కల్యాణ్ వెంటనే ఆ భూమిని తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించాలని, అక్కడ అక్రమంగా వేసిన కంటైనర్లు, మట్టిని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ వివాదం గత కొన్ని రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా నడుస్తోంది. హైదరాబాద్‌లోని జన్వాడ సమీపంలో ఉన్న కోడి చెరువు స్థలాన్ని ఆక్రమించి పవన్ కల్యాణ్ ఫామ్‌హౌస్ నిర్మించారంటూ విపక్షాలు, పలు సామాజిక సంఘాలు గ్రౌండ్ రిపోర్టులతో సహా ఆరోపణలు గుప్పిస్తున్నాయి. అయితే, ఈ ఆరోపణలను జనసేన అధినేత పవన్ కల్యాణ్ గట్టిగా ఖండించారు. తాను ఎలాంటి చెరువు స్థలాన్ని కబ్జా చేయలేదని స్పష్టం చేసిన ఆయన, నిబంధనల ప్రకారమే తన భూమి ఉందని తన ఇంటి వద్ద పెట్టిన ప్రెస్మీట్‌లో వివరణ ఇచ్చారు.అదికబ్జా అయితే ప్రభుత్వానికి ఇచ్చేస్తానన్నారు. తెలంగాణ ఎవరిదో ఒకరి తాతల, ముత్తాతల జాగీరు కాదు. ఇది బరాబర్ తెలంగాణ ప్రజల జాగీరు. 1,200 మంది అమరవీరుల త్యాగాలు, కోట్ల మంది కడుపు కట్టుకుని చేసిన సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సిద్ధించిన గడ్డ ఇది అని కవిత స్పష్టం చేశారు. స్థానిక వనరులను, అస్థిత్వాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తూ, ప్రజల దృష్టిని మళ్లించేందుకు కొన్ని శక్తులు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాయని ఆమె మండిపడ్డారు. రాజ్యాంగం ప్రకారం ఎవరైనా ఎక్కడైనా రాజకీయం చేయవచ్చు కానీ, దానికి కనీస నైతికత ఉండాలని, గతంలో తెలంగాణ వనరులను దోచుకున్న వారే ఇప్పుడు మళ్లీ ఇక్కడి సెంటిమెంట్‌ను వాడుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో గత మరియు ప్రస్తుత పాలనను పోలుస్తూ 'కేటీఆర్' అనే మూడక్షరాలపై కవిత ఆసక్తికరమైన పొలిటికల్ పంచ్ వేశారు. "నాడు, నేడు.. ఎప్పుడైనా కేటీఆర్ పాలనే నడుస్తోంది" అని వ్యాఖ్యానించారు. అయితే దీనికి ఆమె ఇచ్చిన వివరణ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. నాడు 'కేటీఆర్' అంటే కేసీఆర్, తన్నీరు హరీష్ రావు, రామారావు అని, నేడు 'కేటీఆర్' అంటే.. కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి అని ఆమె చెప్పుకొచ్చారు. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆ ముగ్గురు నేతలు రాత్రింబగళ్లు కష్టపడి రాష్ట్ర అభివృద్ధి కోసం, సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేశారని కవిత గుర్తుచేశారు. కానీ నేడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక, పాలనను పూర్తిగా కుటుంబ సభ్యుల చేతుల్లో పెట్టి నడిపిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికే కాంగ్రెస్, బీజేపీలు కలిసి లోపాయికారీగా వ్యవహరిస్తున్నాయని ఆమె ఆరోపించారు.బీజేపీకి తెలంగాణలో క్షేత్రస్థాయిలో సొంతంగా బలమైన నాయకత్వం లేదని, కేవలం కొన్ని ఓట్ల కోసం పరాయి శక్తులపై ఆధారపడుతోందని కవిత ఎద్దేవా చేశారు. తెలంగాణ సమాజం మరియు ఇక్కడి కళలను కేవలం తమ వ్యాపారాల కోసం, రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారే తప్ప, ఈ ప్రాంతంపై ఎవరికీ నిజమైన ప్రేమ లేదన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై టీఆర్ఎస్ మరింత ఉధృతంగా పోరాడుతుందని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీస్తామని కవిత స్పష్టం చేశారు.

# జీరో లిక్విడ్ డిశ్చార్జి పంచాయతీలతో గోదావరి పుష్కరాలకు మరింత శోభ

పంచాయతీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.'గోదావరి పుష్కర ఘాట్లు, పుష్కర నగర్ ల వద్ద ఏర్పాట్లు, సౌకర్యాల విషయంలో ముందస్తు ప్రణాళిక అవసరం. ముఖ్యంగా కాలుష్యరహిత గోదావరి పుష్కరాల నిర్వహణ అనేది లక్ష్యంగా పెట్టుకొని ముందుకు వెళ్తున్నాం. ఇందుకు అనుగుణంగా పని చేయండి'అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.

### పుష్కర నగర్ల వద్ద పార్కింగ్

'పుష్కర నగర్ల వద్ద పార్కింగ్, వీధి దీపాలు, వస్త్రాలను మార్చుకునే గదులు, జల్లు స్నానాలు, రోడ్లు, డ్రెయిన్లు, ఆలయాలు, ఇతర ఏర్పాట్లన్నీ పక్కాగా ఉండేలా చూడండి. వాహనాల నిలుపుదలకు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను ప్రత్యేకంగా ఇవ్వండి'అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.'ఏ ప్రాంతం వైపు నుంచి వచ్చే వారు ఆ ప్రాంతంలోనే స్నానాలను ఆచరించి వెళ్లేలా చూడండి. ఘాట్ వెడల్పు, వచ్చే జనంపై ముందస్తు అంచనా అనేది చాలా ముఖ్యం. అవసరం అయితే వచ్చే భక్తులను బట్టి ఘాట్ వెడల్పు పెంచుకునే వెసులుబాటును ముందస్తుగానే ఉంచుకోండి'అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

### చుక్క మురుగు నీరు గోదావరిలో కలవకూడదు

'గోదావరిలోకి మురుగు నీరు కలవకుండా పక్కా చర్యలు తీసుకోవాలి. పంచాయతీల మురుగు నీటి వ్యవస్థను సరిదిద్దాలి. పుష్కరాలకు సంబంధించిన పంచాయతీల్లో సీసీ రోడ్లు, మ్యాజిక్ డ్రెయిన్ల ద్వారా మురుగు నీటిని సమూలంగా అరికట్టేలా పంచాయతీలవారీగా ప్రణాళికను సిద్ధం చేయండి'అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.'గోదావరిలోకి పంచాయతీల నుంచి చుక్క మురుగునీరు కూడా రాకుండా చేయాలి. దీనికి సంబంధించి ఏ పనులు చేయాలి..? ఎంత ఖర్చు అవుతుంది..? అనే ప్రణాళికను వెంటనే చూసుకోవాలి. ప్రధాన ఘాట్లలో గోదావరికి హారతి కార్యక్రమం గురించి దేవాదాయ శాఖను సమన్వయం చేసుకొని ఆలయాల పునరుద్ధరణ పనులను వేగవంతం చేయండి. మ్యాజిక్ డ్రైన్ల వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి. పంచాయతీల్లో మురుగు నీరు కనిపించకుండా ఈ డ్రైన్లు చేస్తున్నాయి'అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.

### మునికూడలి ఘాట్ జాతీయ స్థాయి మోడల్ కావాలి

'సీతానగరం వద్ద ఉన్న మునికూడలి ఘాట్ ను జాతీయ స్థాయి మోడల్ ఘాట్ గా తీర్చిదిద్దాలన్నది లక్ష్యం. ?మునికూడలి ఘాట్ కి సప్తర్షి పుష్కర్ ఘాట్ పేరిట తీర్చిదిద్దాలి. 80 మీటర్ల వెడల్పు ఉన్న ఈ ఘాట్ లో 75 వేల మంది పుష్కర స్నానం చేసేందుకు అనువుగా ఉంటుంది'అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 'ఈ ఘాట్ వద్ద అవసరం అయిన అన్ని ఏర్పాట్లను పక్కాగా చేయండి. పార్కింగ్ కోసం రైతుల పొలాలను ఉపయోగించినా, మట్టి తీసినా పార్కింగ్ ఫీజులో వారికి వాటా ఇచ్చేలా ప్లాన్ చేయండి. వారి అనుమతి తీసుకొని పుష్కరాలకు వారి సహాయసహకారాలతోనే ముందుకు వెళ్దాం. ఈ ఘాట్ వద్ద సోమేశ్వరాలయం, వేణుగోపాల స్వామి ఆలయాలున్నాయి. వీటిని ఆధునీకరించే పనులు వేగవంతం చేయండి. నేను ఈ నెలలో జరగనున్న కేబినెట్ సమావేశం తర్వాత మునికూడలి ఘాట్ ను సందర్శిస్తాను. చేయాల్సిన పనులను స్వయంగా పరిశీలిస్తాను. సమష్టిగా పనిచేసి పుష్కరాల నిర్వహణలో ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలి' డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, ఓఎస్డీ వెంకటకృష్ణ ఉన్నారు.

# మహిళలకు అండగా తెలంగాణ పోలీస్

వారందరికీ సీపీ ఆనంద్ డ్రైవింగ్ లైసెన్స్‌లు అందించారు. ఎమర్జెన్సీ పరిస్థితుల్లో మహిళలకు సురక్షితంగా రవాణా సేవలు అందించేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.స్విగ్గీ, జొమాటో తరహాలో డెలివరీ సేవల్లో మహిళలు భాగస్వామ్యం కావడంపై డీజీపీ సంతోషం వ్యక్తం చేశారు. రానున్న 4 నెలల్లో మహిళా రైడర్ల సంఖ్యను ఇప్పుడు ఉన్న దాని కన్నా 3 రెట్లు పెంచాలని హితవు పలికారు. మహిళల ఉపాధి, సాధికారతకు తెలంగాణ సర్కార్ పూర్తి మద్దతును ఇస్తోందని వెల్లడించారు.ఓలా, ఉబర్, ర్యాపిడో లాగానే మహిళల కోసం మహిళా డ్రైవర్లనే అందుబాటులోకి తీసుకువస్తూ మోవో ఫ్లీట్ యాప్ ద్వారా ఈ స్త్రీ రైడ్ సర్వీసులను ప్రారంభించారు. ఈ మోవో ఫ్లీట్ యాప్ వల్ల ఇక నుంచి యువతులు, మహిళలకు ఎలాంటి భయం లేకుండా వారు మహిళా డ్రైవర్లను బుక్ చేసుకుని ప్రయాణించే అవకాశం కల్పించారు.మహిళలకు స్వయం ఉపాధిని అందించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని డీజీపీ తెలిపారు. అన్నిరంగాల్లో మహిళలు ముందుకురావాలని విజ్ఞప్తి చేశారు. పోలీసు శాఖలోనూ మహిళలు మరిన్ని బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్షించారు. మరీ ముఖ్యంగా మహిళలు ఎస్‌హెచ్ఓ పోస్టుల్లోకి రావాలని పిలుపునిచ్చారు. మహిళలు ఎదగాలంటే వారి కుటుంబ సభ్యులు సహకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మహిళల సాధికారతకు ఫ్యామిలీ మద్దతును పెంచేందుకు 'స్టాండ్ విత్ హర్' అనే కార్యక్రమాన్ని కూడా తెలంగాణ పోలీసులు నిర్వహిస్తున్నట్లు డీజీపీ వెల్లడించారు.

# త్వరలోనే పోలీస్ ఉద్యోగాల భర్తీ

వారు పాలకులుగా వచ్చారని కానీ తాను మాత్రం ఒక పాలకుడిగా కాకుండా సేవకుడిగా, సామాన్య ప్రజల ప్రతినిధిగా వచ్చినట్లు రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ఎన్నికలకు ముందు నిర్వహించిన పాదయాత్రలో రాష్ట్రంలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకున్నానని గుర్తు చేశారు. అందుకే తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిపారు.అంతేకాకుండా మన దేశంలోనే అత్యధిక సంఖ్యలో ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత తెలంగాణదేనని గర్వంగా చెప్పారు. కొన్ని రోజుల్లోనే పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 5 వేల పోస్టులను భర్తీ చేసేందుకు జాబ్ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఒక ప్రకటన చేశారు. తెలంగాణలోని యువత ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధం అవుతున్నారని పేర్కొన్నారు.

# చంద్రబాబుతో రేవంత్ రెడ్డి కుమ్మక్కయ్యారు

25 శాతానికే పరిమితమైంది" అని హరీశ్ రావు ఆరోపించారు. ఈ వైఫల్యానికి గానూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో పాలమూరు పరిధిలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని గుర్తుచేశారు. పాలమూరు రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా మోసం చేసిందని, రాబోయే రోజుల్లో కొడంగల్‌లో రేవంత్ రెడ్డిని మళ్లీ ఓడించి, పాలమూరు గడ్డపై గులాబీ జెండా ఎగరేస్తామని హరీశ్ రావు ధీమా వ్యక్తం చేశారు.

## పుప్పాలగూడలో 198 ఎకరాల ప్రభుత్వ భూమికి కంచె

**హైదరాబాద్,** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైడ్రా ఒక భారీ ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టింది. దశాబ్దాలుగా వివాదాల్లో నలుగుతూ, కబ్జాదారుల కబంధ హస్తాల్లో చిక్కుకునే ప్రమాదంలో ఉన్న అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని రక్షించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ-ఖాజాగూడ సరిహద్దుల్లో ఉన్న 198 ఎకరాల ప్రభుత్వ భూమిని శుక్రవారం హైడ్రా తన ఆధీనంలోకి తీసుకుంది. సుమారు రూ.30,000 కోట్ల విలువ చేసే ఈ భూమిలో 250 కోట్ల సంవత్సరాల నాటి అరుదైన చారిత్రక రాతి గుట్టలు కూడా ఉండటం విశేషం. ఈ ఆపరేషన్‌తో అమూల్యమైన ప్రకృతి, చారిత్రక సంపదకు హైడ్రా రక్షణ కవచం ఏర్పాటు చేసింది రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఎండీఏకు కేటాయించిన ఈ భూమిలో అద్భుతమైన రాతి శిలలు, గుహలు, పచ్చని చెట్లు ఉన్నాయి. ఈ చారిత్రక సంపదను కాపాడాలంటూ 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు దశాబ్దాలుగా న్యాయపోరాటం చేస్తున్నారు. వారి పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, 2019లోనే ఈ రాతి గుట్టలతో పాటు ప్రభుత్వ భూమిని సంరక్షించాలని మున్సిపల్, రెవెన్యూ శాఖలను ఆదేశించింది. అయితే, హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేయడంలో జాప్యం జరగడంతో భూమి కబ్జాకు గురయ్యే ప్రమాదం ఏర్పడింది. దీంతో 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెంటనే స్పందించి, క్షేత్రస్థాయిలో పర్యటించారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి సంయుక్తంగా సర్వే నిర్వహించి, భూమిని ప్రభుత్వ ఆస్తిగా నిర్ధారించుకున్నారు. అనంతరం శుక్రవారం పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం.. సర్వే నంబర్ 452/1లో 174 ఎకరాలు, 454/1లో 119.05 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఓవర్‌ల్యాప్ సమస్యల కారణంగా 63.05 ఎకరాలు ప్రైవేటు వ్యక్తులకు చెందినదిగా గుర్తించి, మిగిలిన భూమిలో దేవాలయాలకు 5 ఎకరాలు, దర్గాకు 5 ఎకరాలు కేటాయించగా, నికరంగా 200 ఎకరాల హెచ్ఎండీఏ భూమిని హైడ్రా కాపాడింది.ఈ ఆపరేషన్‌పై 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. సహజ సిద్ధమైన వ్యూ పాయింట్లు, చారిత్రక గుట్టలను కాపాడి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసినందుకు హైడ్రాను అభినందించారు. స్థానిక ప్రజలు, పర్యావరణ ప్రేమికులు సైతం ప్రభుత్వ చొరవను కొనియాడారు. ఇదే సమయంలో, ఈ గుట్టలను ఆనుకుని ఉన్న భగీరథమ్మ చెరువును కూడా హైడ్రా పునరుద్ధరిస్తోంది. ఒకవైపు ఎత్తైన కొండలు, మరోవైపు జలకళతో నిండిన చెరువుతో ఈ ప్రాంతం భవిష్యత్తులో ఒక అద్భుతమైన పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## తీవ్ర స్థాయికి 'మెగా డీఎస్సీ' రాజకీయ పోరు

ఆంధ్రప్రదేశ్‌లో 'మెగా డీఎస్సీ' నియామకాల చుట్టూ జరుగుతున్న రాజకీయ పోరు తీవ్ర స్థాయికి చేరింది. ఉపాధ్యాయ నియామకాలు పూర్తయి అభ్యర్థులు విధుల్లో చేరిన తొమ్మిది నెలల తర్వాత, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక్కసారిగా ఈ అంశాన్ని తెరపైకి తెచ్చింది. పేపర్ లీకులు, స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయని, అర్హులకు అన్యాయం చేసి ఉద్యోగాలు అమ్ముకున్నారంటూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు దిగింది. అయితే, ఈ రాజకీయ దాడిని అధికార తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం ఎదుర్కొంటున్న తీరు, క్షేత్రస్థాయిలో అందుతున్న పారదర్శక వివరణలు వైరల్ అవుతున్నాయి. ఉద్యోగ నియామకాలు ముగిసి, విద్యావ్యవస్థ సాఫీగా సాగుతున్న తరుణంలో వైసీపీ ఈ వివాదాన్ని లేపడం వెనుక పక్కా రాజకీయ కార్యాచరణ ఉందనేది స్పష్టమవుతోంది. స్పోర్ట్స్ కోటా కింద 421 పోస్టుల భర్తీలో నిబంధనలు ఉల్లంఘించారని, జీవోలను మార్చడం ద్వారా తప్పుడు సర్టిఫికేట్లు ఉన్నవారికి లబ్ధి చేకూర్చారని మాజీ మంత్రి పేర్ని నాని వంటి సీనియర్ నేతలు ఆరోపిస్తున్నారు. ఉపాధ్యాయ ఉద్యోగం రాని నిరుద్యోగుల్లో ఉన్న అసంతృప్తిని క్యాష్ చేసుకుని, కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెంచాలనే ఉద్దేశంతోనే ఈ పేపర్ లీక్, అక్రమాల అస్త్రాన్ని ఆ పార్టీ ప్రయోగించిందని భావిస్తున్నారు.సాధారణంగా ఇలాంటి భారీ ఆరోపణలు వచ్చినప్పుడు ప్రభుత్వాలు డిఫెన్స్‌లో పడటం లేదా ఎదురుదాడికి దిగడం చూస్తుంటాం. కానీ, చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఈ విషయంలో వ్యూహాత్మక ఓపికను ప్రదర్శిస్తోంది. స్వయంగా ప్రెస్ మీట్ పెట్టి, వైసీపీ చేస్తున్న ప్రతి ఆరోపణకూ సుదీర్ఘంగా, ఓపిగ్గా వివరణ ఇచ్చారు. స్పోర్ట్స్ కోటా భర్తీ అంతా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కేటగిరీలు, గైడ్‌లైన్స్ ప్రకారమే జరిగిందని, ఆరోపణలు చేసేవారికి కనీసం అందులోని క్రీడల పేర్లు కూడా తెలియవంటూ సీఎం గట్టి కౌంటర్ ఇచ్చారు. అలాగే విద్యాశాఖ ఉన్నతాధికారులు కూడా ప్రెస్ మీట్లు పెట్టి ప్రతి అంశాన్ని లెక్కలతో సహా నిరూపిస్తున్నారు.వైసీపీ అనుకూల మీడియా , సోషల్ మీడియా హ్యాండిల్స్ ఎక్కడ ఏ అభ్యర్థి పేరుతో తప్పుడు ప్రచారం ప్రారంభించినా, టీడీపీ సోషల్ మీడియా విభాగాలు గంటల వ్యవధిలోనే ఆ అభ్యర్థికి సంబంధించిన హాల్ టికెట్ నంబర్, మెరిట్ మార్కులు, ర్యాంకు వివరాలను ఆధారాలతో సహా ఆన్‌లైన్‌లో పెడుతున్నాయి. మెరిట్ జాబితాలో లేని వారు, క్వాలిఫై కాని వారు కేవలం నిరుద్యోగులను తప్పుదోవ పట్టించడానికి చేస్తున్న ప్రయత్నాలను డిజిటల్ సాక్ష్యాలతో తిప్పికొడుతున్నారు. ప్రభుత్వం డీఎస్సీ డేటాను, సెలక్షన్ లిస్టులను పూర్తిగా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచడం, ఎవరికి ఏ అనుమానం ఉన్నా వెరిఫై చేసుకునే వీలు కల్పించడంతో సాధారణ అభ్యర్థులకు సైతం వాస్తవాలు కళ్లెదుటే కనిపిస్తున్నాయి. దీంతో ఒకప్పుడు క్షేత్రస్థాయిలో సంచలనం సృష్టిస్తుందనుకున్న వైసీపీ డీఎస్సీ స్కామ్ వాదన.. డేటా ముందు నిలబడలేక క్రమంగా పస కోల్పోతోంది. ఉపాధ్యాయులుగా ఎంపికైన రూరల్ బ్యాక్‌గ్రౌండ్ అభ్యర్థులు, క్రీడాకారులు కూడా స్వయంగా వీడియోలు విడుదల చేస్తూ.. తాము కష్టపడి మెరిట్ ద్వారానే ఉద్యోగాలు సాధించామని, తమను రాజకీయంలోకి లాగొద్దని అంటున్నారు. ఈ మొత్తం ఎపిసోడ్‌ను గమనిస్తే, రాజకీయంగా ప్రస్తుతానికి కూటమి ప్రభుత్వానిదే పైచేయిగా కనిపిస్తోంది. వైసీపీ ఆరోపణల తీవ్రతతో ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలని చూసినప్పటికీ, టీడీపీ ప్రభుత్వం ఆవేశం కంటే డేటా ప్రదర్శన మిన్న అనే సూత్రాన్ని నమ్మింది. అయితే, కోర్టుల్లో నడుస్తున్న కొన్ని పిటిషన్లు, విచారణల వల్ల భవిష్యత్తులో ఈ వివాదం ఎలాంటి మలుపు తీసుకుంటుందనేది చూడాలి. కానీ ప్రస్తుతానికి మాత్రం పారదర్శకత అనే కేడర్ ద్వారా ప్రభుత్వం ఈ పొలిటికల్ దాడిని విజయవంతంగా తిప్పికొట్టిందనే చెప్పవచ్చు.

## జనసేన తరపున తొలి రాజ్యసభ సభ్యుడి లింగమనేని

**హైదరాబాద్** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. రాజ్యసభ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థిగా లింగమనేని రమేష్ అసెంబ్లీలో తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. జనసేన పార్టీ తరపున రాజ్యసభ రేసులోకి ఒక అభ్యర్థి అధికారికంగా ఎంట్రీ ఇవ్వనుండటం ఇదే తొలిసారి కావడం విశేషం.ఈ నామినేషన్ ప్రక్రియ అధికార ఎన్డీఏ కూటమిలోని మూడు భాగస్వామ్య పార్టీల మధ్య ఉన్న బలమైన ఐక్యతను స్పష్టం చేసింది. లింగమనేని రమేష్ నామినేషన్‌ను సమర్థిస్తూ ఆరుగురు జనసేన ఎమ్మెల్యేలు, ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలు, ఒక బీజేపీ ఎమ్మెల్యే సంతకాలు చేశారు.నామినేషన్ దాఖలు చేసే సమయంలో కూటమికి చెందిన ఎమ్మెల్యేలు ఆయనకు మద్దతుగా పెద్ద సంఖ్యలో అసెంబ్లీకి తరలివచ్చారు. వీరిలో నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర, బొలిశెట్టి శ్రీనివాస్ నాయక్, వంశీకృష్ణ శ్రీనివాస్, పులపర్తి రామాంజనేయులు, దేవా వరప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, నక్కా ఆనంద్ బాబు, బీజేపీ ప్రతినిధి ఎన్. ఈశ్వర్ రావు తదితరులు ఉన్నారు. మరోవైపు, మిగిలిన మూడు రాజ్యసభ స్థానాలకు టీడీపీ అభ్యర్థులు నామినేషన్ వేయనున్నారు. టీడీపీ అభ్యర్థుల పేర్లు ఇంకా వెల్లడి కావాల్సి ఉంది.

## అంగుళూరులో అక్రమంగా గ్యాస్ రీ ఫిల్లింగ్

**దేవి పట్నం** మండలంలో పూడిపల్లి పంచాయితీ అంగుళూరు గ్రామంలో గ్యాస్ అక్రమ విక్రయాలకు అడ్డాగా మారింది. నిత్యం పదుల సంఖ్యలో సిలిండర్లు వ్యాపారం జోరుగా సాగుతోంది. పక్కా సమాచారంతో విజిలెన్స్ ఎస్పి రామ్ కుమార్ ఆదేశాల మేరకు విశ్వసనీయ సమాచారంతో విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు శనివారం అక్రమ గ్యాస్ రీ ఫిల్లింగ్ పై ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడిలో అంగుళూరు గ్రామానికి చెందిన అప్పన్న బాబు నుంచి సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. ఎటువంటి లైసెన్స్ లేకుండా అక్రమ నిల్వలు ఉంచి గ్యాస్‌ను రీఫిల్లింగ్ చేస్తూ అధిక మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారు. డొమెస్టిక్ సిలిండర్ నుంచి వాణిజ్య సిలిండర్లకు గ్యాస్ రీఫిల్లింగ్ చేసేందుకు అవసరమైన ఒక మోటారు , ఒక వెయింగ్ మిషన్ కూడా అక్రమార్కులు ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. యంత్రపరికరాలను కూడా అధికారులు పట్టుకున్నారు.

అక్రమ గ్యాస్ సిలిండర్లు వ్యాపారం ఎన్నో రోజులుగా ఒక కుటీర పరిశ్రమలా నిర్వహిస్తూ నెలనెలా వేలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో అక్రమ సిలిండర్లు వ్యాపారంపై అధికారులు ప్రత్యేక నిఘాపెట్టారు. ఈ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు బయటపడడంతో అధికారులు కంగుతిన్నారు. ఈనేపథ్యంలో పక్కా సమాచారంతో షాప్ పై దాడి చేశారు. ఎస్ఐ షరీఫ్ తన సిబ్బందితో గ్రామానికి చేరుకొని పరిస్థితిని పర్యవేక్షించారు. ఎట్టకేలకు అక్రమ గోడౌన్ వ్యవహారం బయటపడడం మండలంలో చర్చనీయాంశమైంది. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఇన్స్పెక్టర్ టి నాగ వెంకటరాజు, విజిలెన్స్ ఏజీ లక్ష్మీనారాయణ,ఆర్ ఐ బులక్ష్మి,వీఆర్వో సాలీమ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.బ్లాకులో రూ.2500 అమ్మకంయుద్ధం నేపథ్యంలో సిలిండర్ ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. గతంలో ఇంటి అవసరాల సిలిండర్ బ్లాకులో రూ.1200 ఉండేది. ఇప్పుడు అదే సిలిండర్ సుమారు రూ.2500 వరకు పెంచి అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు.

# మరో భూదొంగ అరెస్టు

**హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాలలో పెట్టుబడుల పేరుతో హైదరాబాద్ కొల్లూరులో వివాదాస్పద భూములు తమవంటూ ప్రీ లాంచ్ కింద సుమారు రూ.100 కోట్ల రూపాయలు వసూలు చేసి పరారీలో ఉన్న మెసార్స్ డెవలపర్ అధినేత మారెళ్ళ పెంచల సుబ్బారెడ్డిని మాదాపురం పోలీసులు అరెస్టు చేశారు.సుబ్బారెడ్డి శనివారం ఉదయం హైటెక్ సిటీలో ఒక హోటల్లో బ్రేక్ ఫాస్ట్ చేస్తుండగా సమాచారం తెలుసుకున్న బాధితులు, మాదాపురం పోలీస్ స్టేషన్ కు వెళ్లి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సుబ్బారెడ్డి బ్రేక్ ఫాస్ట్ చేస్తున్న హోటల్ కి వెళ్లిన పోలీసులు, సుబ్బారెడ్డిని అరెస్టు చేశారు. ఏపీలో కూడా సుబ్బారెడ్డి పై కేసులు నమోదై ఉన్నాయి.నెల్లూరు జిల్లాలో పెంచల సుబ్బారెడ్డి పై పలు కేసులు నమోదయ్యాయి. తెలంగాణ రాష్ట్రం వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్పను కూడా కోటి రూపాయలు మోసం చేసిన దాంట్లో సుబ్బారెడ్డి పై గద్వాల పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది. ఇతను గత రెండేళ్లుగా వివాదాస్పద భూములపై ప్రీ లాంచ్ వెంచర్లంటూ అందమైన బ్రోచర్లతో వందలాదిమందిని ముంచి సుమారు 100 కోట్లకు పైగా దోచుకున్న విషయం అందరికీ తెలిసిందే. ఎట్టకేలకు బాధితులకు చిక్కిన మారెళ్ళ పెంచల సుబ్బారెడ్డి మాదాపురం పోలీసులు అదుపులో ఉన్నాడు. లేని భూమిని ఉన్నట్టు చూపించి కోట్ల రూపాయలు వసూలు చేసి పరారీలో ఉన్న సుబ్బారెడ్డి ఇప్పుడు అరెస్టు అయ్యాడు.

# తిరుమలలో ఘర్షణ

**తిరుమల** తిరుమల టెలిఫోన్ ఎక్స్చేంజ్ రోడ్డులో అర్ధరాత్రి ఘర్షణ చెలరేగింది. గుర్తుతెలియని వ్యక్తుల మధ్య పరస్పర దాడులు జరిగాయి. మారణాయుధాలతో దాడి చేసినట్లు సమాచారం. తలపై దాడులతో రక్తస్రావం అయినట్లు స్థానికులు వెల్లడించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద అనధికార కూల్డ్రింక్స్ విక్రేతల మధ్య గొడవగా అనుమానాలు వున్నాయి. ఒకరిపై ఒకరు విచక్షణారహితంగా దాడులకు పాల్పడ్డారు. గంజాయి మత్తులో దాడులు జరిగినట్లు స్థానికుల అనుమానం. ఘటనతో టెలిఫోన్ ఎక్స్చేంజ్ రోడ్డులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భక్తులు భయాందోళనలతో పరుగులు తీసారు. సమాచారం అందుకున్న విజిలెన్స్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకోక ముందే గ్యాంగ్ పరారయింది. అధికారులు ఘటనపై పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. దాడులకు పాల్పడిన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు

### కేటీఆర్, మంత్రి పొన్నం ప్రభాకర్ నోరు

# అదుపులో పెట్టుకోవాలి

**- కవిత.. తీహార్ జైల్లో చిప్ప కూడు తినింది**

**- జనసేన ఆర్కే సాగర్**

**హైదరాబాద్** కేటీఆర్, మంత్రి పొన్నం ప్రభాకర్ నోరు అదుపులో పెట్టుకోవాలి. తెలంగాణ నీ అయ్యా జాగీరా అనిన పవన్ కళ్యాణ్ మాటలను వక్రీకరించారని జనసేన పార్టీ ప్రచార కార్యదర్శి ఆర్కే సాగర్ అన్నారు. గద్దర్ కూతురు వెన్నెల పవన్ కళ్యాణ్ గురించి బాగా తెలుసు. జాగీరా అని పవన్ కళ్యాణ్ అన్నది రాజకీయ నాయకులు, పాలకులను ఉద్దేశించి. నిజంగా పవన్ కళ్యాణ్ చెరువును కబ్జా చేస్తే.. ప్రభుత్వం సీజ్ చేసుకోవచ్చని అయన అన్నారు.
తీహార్ జైల్లో చిప్పకూడు తినిన వాళ్ళు కూడా నీతులు చెప్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో జాగృతి పేరుతో కవిత కోట్లు వసూళ్ళు చేసింది. అమెరికా నుంచి కవిత హియామత్ నగర్ లో బ్యూటీ పార్లర్ నడిపింది నిజం కాదా?పవన్ కళ్యాణ్ పై మాట్లాడే కవిత సహా.. ఇతర నేతలు వారి ఆస్తులను బయట పెట్టాలి. గద్దర్ ను ఉద్దేశించి.. తెలంగాణ వ్యతిరేకి అని స్వయంగా కేసీఆర్ అన్నారు. ఈ విషయం వెన్నెల తెలుసుకోవాలి. పవన్ కళ్యాణ్ ను అంటే తెలంగాణ బిడ్డలను అన్నట్లే. పవన్ కళ్యాణ్ పక్కన ఉన్నది తెలంగాణ బిడ్డలమే. కోడి చెరువు గురించి కవిత మాట్లాడటం హాస్యాస్పదం. గెటప్ లు మార్చుకుని ప్రెస్ మీట్స్ నిర్వహిస్తున్నారు. గద్దర్ కు కారు కొనిస్తే.. దానిపై కూడా విమర్శలా? గద్దర్ ను రోడ్డుపై నిలబెట్టిన ఘనత కవిత కుటుంబానిదే అని అన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు

**- విచారణకు హాజరయిన ఎంపి చామల**

**హైదరాబాద్** ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో భాగంగా భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్రెడ్డి శనివారం సిట్ అధికారుల ఎదుట హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. “2023 జులైలో నేను టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్గా ఉన్న సమయంలో నా ఫోన్ ట్యాప్ అయిందని అధికారులు చెప్పారు. అప్పుడు పీసీసీ చీఫ్ రేవంత్రెడ్డికి సన్నిహితంగా ఉన్నాను. ఆయన టీమ్ సభ్యుడిగా ఉన్నందుకు నా ఫోన్ ట్యాప్ చేశారు.

# ఘనంగా ఇకబెనా దినోత్సవాలు

**హైదరాబాద్** ఇకబెనా ఇంటర్నేషనల్ హైదరాబాద్ ఛాప్టర్ ప్రపంచ ఇకబెనా దినోత్సవ వేడుకలను ఐటీసీ కాకతీయ హోటల్లో ఘనంగా నిర్వహించుకున్నారు. అవాంట్ గార్డె థీమ్తో నిర్వహించిన ఈ వేడుకల్లో పలువురు మహిళలు ఇంట్లోని చిన్న వస్తువులతో, వ్యర్థాలతో అందమైన పూల మొక్కలను, ఆకృతులు తయారు చేసి ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణి ప్రసాద్ ప్రారంభించి మహిళలను అభినందించారు. కళాత్మకంగా తయారు చేసిన పలు ఆకృతులను చూసి ఆమె మురిసిపోయారు. ఈ కార్యక్రమంలో ఇకబెనా హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షురాలు హోకా సుకన్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# షి టీమ్ అవగాహన సదస్సు

**- ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ ఎస్.రష్మి పెరుమాళ్**




**సిద్దిపేట** పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సైబర్ నేరాలు, డ్రగ్స్ మహమ్మారిపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి. సీపీ రష్మి పెరుమాళ్ అన్నారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సిద్దిపేట జిల్లా షి టీమ్ ఆధ్వర్యంలో సురభి మెడికల్ కాలేజీలో విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మి పెరుమాళ్,ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజ, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎ.బి. దుర్గ, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ కె. లక్ష్మీబాబు ,కళాశాల ఏఓ అమృత్ పాల్ సింగ్, మరియు ఎంబీబీఎస్, నర్సింగ్ విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ వైద్యులు, పోలీసులు 24 గంటలూ ప్రజల కోసమే శ్రమిస్తారని, నిరంతరం బాధల్లో ఉన్న ప్రజలను చూస్తూ,ఎల్లప్పుడూ అలర్ట్గా ఉండాల్సిన బాధ్యత ఈ రెండు రంగాలపై ఉందన్నారు. ప్రస్తుతం 'డిజిటల్ అరెస్ట్' పేరుతో జరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని సాధ్యమైనంత తక్కువగా పంచుకోవాలని, ఆన్లైన్ నేరాలకు గురికాకుండా జాగ్రత్తపడాలని కోరారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే, డబ్బులు లేదా డేటా దుర్వినియోగం కాకుండా ఉండటానికి ముందే సిమ్ కార్డ్ను మరియు బ్యాంకు ఖాతాలను బ్లాక్ చేయాలని సూచించారు. విద్యార్థి జీవితంలో ర్యాగింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన వాతావరణంలో చదువుకోవాలని పిలుపునిచ్చారు. జీవితంలో డ్రగ్స్కు ఎట్టిపరిస్థితుల్లోనూ 'నో' చెప్పాలని స్పష్టం చేశారు. సిద్దిపేటలో డ్రగ్స్ బారిన పడిన వారి కోసం డీ-అడిక్షన్ సెంటర్ అందుబాటులో ఉందని, ఎవరైనా వ్యసనపరులు ఉంటే అక్కడ చేర్పించేలా సమాచారం ఇవ్వాలన్నారు.

# ఖైదీలు తక్కువగా ఉన్నారనే నెపంతో బద్వేల్ సబ్ జైలును మూసి వేయడం దుర్మార్గం

**- బద్వేల్ సబ్ జైలును యధావిధిగా కొనసాగించాలని ఆర్డీవో కి వినతిపత్రం సమర్పించిన లిబరేషన్ పార్టీ నాయకులు.**




**బద్వేలు** నియోజకవర్గ కేంద్రమైన బద్వేల్ పట్టణంలోని సబ్ జైలును మూసివేయాలని ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకొని సబ్ జైలును యధావిధిగా కొనసాగించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో బద్వేలు రెవిన్యూ డివిజనల్ అధికారి చంద్రమోహన్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు సంఘట చంద్రశేఖర్ మాట్లాడుతూ, దశాబ్దాల కాలం నుండి బద్వేల్ పట్టణంలో కొనసాగుతున్న సబ్ జైలు సిబ్బందిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తూ సబ్ జైలును మూసివేయాలని ఉత్తర్వులు ఇవ్వడం దుర్మార్గమని, బద్వేల్ పట్టణంలో ఉన్న సివిల్ కోర్టు సముదాయాలలో రోజువారీగా బద్వేలు నియోజకవర్గంలో ఏడు మండలాలైన కాశి నాయన కలసపాడు పోరుమామిళ్ల బి కోడూరు బద్వేల్ గోపవరం అట్లూరుతో పాటు బీ మఠం మండలాలలోని వివాదాలపై కేసులు, తీర్పులు జరుగుతుంటాయని ఈరోజు ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా అకస్మాత్తుగా బద్వేల్ సబ్ జైలు మూసివేతకు ఆదేశాలు ఇవ్వడం సరి కాదని ఈ విషయంపై పునరాలోచించి మూసివేత ఉత్తర్వులను మరియు సిబ్బంది బదిలీ ఉత్తర్వులను ఉపసంహరించుకొని సబ్ జైలును, సిబ్బందిని యధావిధిగా కొనసాగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ దిశగా సబ్ జైలును యధావిధిగా కొనసాగించేలా కూటమి ప్రభుత్వ పెద్దలు దృష్టి పెట్టి జైళ్ల శాఖ ఉన్నతాధికారులతో చర్చించి యధావిధిగా ఉండేలా కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లిబరేషన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జకరయ్య అనిల్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు శిఖామణి, లిబరేషన్ పార్టీ ఏరియా కమిటీ సభ్యులు బాబు విజయరావు జయరామరాజు నారాయణ గంటా మహబూబ్బాషా పట్టణ కమిటీ సభ్యులు రమణ నరసింహ శాంసన్ తదితరులు పాల్గొన్నారు

### ఐటీ కారిడార్లో బైక్ స్టంట్లు, రేసింగ్లపై

# పోలీస్ ఉక్కుపాదం

**- ఐదుగురు అరెస్ట్, 5 బైక్లు, కారు సీజ్....**

ఐటీ కారిడార్, టీ-హబ్ పరిసర ప్రాంతాల్లో వీకెండ్స్లో బైక్ స్టంట్లు, ప్రమాదకర రేసింగ్లతో హల్చల్ చేస్తున్న పోకిరీలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. రీల్స్ పిచ్చితో రోడ్లపై ప్రాణసంకటంగా మారుతున్న వాహనదారులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, కఠిన చర్యలు చేపట్టారు. ఈ డ్రైవ్కు సంబంధించిన వివరాలను కూకట్పల్లి డీసీపీ రితి రాజ్ మీడియాకు వెల్లడించారు.ఐటీ కారిడార్, టీ-హబ్, ఐకియా (ఎఐఇం) పరిసర ప్రాంతాల్లో గత కొంతకాలంగా అర్ధరాత్రి, వీకెండ్స్ సమయంలో యువత ప్రమాదకర రీతిలో బైక్ స్టంట్లు, రేసింగ్లకు పాల్పడుతున్నారు. దీనివల్ల స్థానిక నివాసితులకు, సాఫ్ట్వేర్ ఉద్యోగులకు తీవ్ర అసౌకర్యం కలగడమే కాకుండా, సాధారణ ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. పైగా, అక్కడ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసుల విధులకు కూడా కొందరు పోకిరీలు ఆటంకం కలిగిస్తున్నారు,తాజా డ్రైవ్లో భాగంగా ప్రమాదకరంగా బైక్ స్టంట్లు చేస్తున్న ఐదుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద నుండి రేసింగ్కు ఉపయోగిస్తున్న 5 బైక్లను, ఒక కారును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు డీసీపీ తెలిపారు. కేవలం ఇన్స్టాగ్రామ్, ఇతర సోషల్ మీడియా ప్లాట్ఫామ్లలో రీల్స్ చేసి, వ్యూస్ సంపాదించడం కోసమే సిటీ చుట్టుపక్కల ప్రాంతాల నుండి యువత ఇక్కడికి వస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు.ఇలాంటి ప్రమాదకరమైన స్టంట్ల వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ, తోటి యువతను తప్పుదోవ పట్టిస్తున్న 35 సోషల్ మీడియా ఖాతాలను పోలీసులు ప్రత్యేకంగా గుర్తించి ఖాతాల నిర్వాహకులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోనున్నామని తెలిపారు.పట్టుబడిన నిందితులపై కేవలం సాధారణ ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు మాత్రమే కాకుండా... భారతీయ న్యాయ సంహిత (ఃఔా), మోటార్ వాహనాల చట్టం (ఓఎ ంఇఃబి) 1988, మరియు ఐటీ యాక్ట్ 2000 లోని వివిధ కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు స్పష్టం చేశారు.

### కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు

# పేదల కోసమే బతికారు

**- సిపిఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్. హుస్సేన్**

**- దాచేపల్లిలో చంద్ర రాజేశ్వరరావు 112 వ జయంతి కి నివాళులు**



**దాచేపల్లి** :పేదల కోసం తన యావత్ జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి కీర్తిశేషులు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు అని సిపిఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ అన్నారు. శనివారం రాజేశ్వరరావు 112వ జయంతిని మరియు ప్రత్తిపాటి రోశయ్య 69వ జయంతిని నారాయణపురం సిపిఐ మండల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు చిత్రపటానికి సిపిఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ ప్రత్తిపాటి రోశయ్య చిత్రపటానికి వేముల వెంకటరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ, 1914 జూన్ 6న కృష్ణా జిల్లా దివిసీమలోని మంగళాపురం గ్రామంలో జన్మించిన చంద్ర రాజేశ్వరరావు భారత కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకునిగా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ ప్రముఖ నాయకులుగా గుర్తింపు గౌరవం పొందారన్నారు అని అన్నారు. సిపిఐ జాతీయ కార్యదర్శిగా 1969-70 ప్రాంతంలో దేశవ్యాప్త భూ పోరాటానికి నాయకత్వం వహించి లక్షలాది ఎకరాలు సాగు భూమి నివేశస్థలాలు పంపిణీ చేశారు అని అన్నారు. అన్నారు రాజేశ్వరరావు అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారన్నారు. రాజేశ్వరరావు సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగాను సిపిఐ జాతీయ కార్యదర్శిగాను 24 సంవత్సరాలు పనిచేశారన్నారు అని అన్నారు. రాజేశ్వరరావు జమీందారీ కుటుంబంలో జన్మించి తనకున్న ఆస్తిని పేదలకు పంపిణీ చేశారు అని అన్నారు. అన్నారు నేటి తరం నాయకులు రాజేశ్వరరావు ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో ఆర్డర్ ఆఫ్ లెనిన్, ఆర్డర్ ఆఫ్ డెమిట్రోవ్ వంటి ప్రతిష్టాత్మక అవార్డులు రాజేశ్వరరావు అందుకున్నారన్నారు.ప్రత్తిపాటి రోశయ్య: సిపిఐ గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి మాట్లాడుతూ, ప్రత్తిపాటి రోశయ్య పెదగార్లపాడు గ్రామంలో పేద కుటుంబంలో జన్మించారన్నారు. సిపిఐ మాజీ శాసనసభ్యులు మందపాటి నాగిరెడ్డి ద్వారా కమ్యూనిస్టు పార్టీలో చేరి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి గుంటూరు జిల్లాలో అనేక గ్రామాలలో సాగుభూమి నివేశ స్థలాలు పంపిణీ చేశారు. పలనాడు ప్రాంతంలో పిడుగురాళ్ల, దాచేపల్లి, కేసనపల్లి, సిపిఐ కాలనీ, జెట్టిపాలెం, పాలువాయి, మంచికల్లు గ్రామాలలో పేదలకు నివేశ స్థలాలను పంపిణీ చేయడంలో రోశయ్య ప్రధాన పాత్ర వహించారు అని అన్నారు. జిల్లా కమిటీ సభ్యునిగా ఏపీయూడబ్ల్యూజే నాయకునిగా మరియు ఐజేయు జాతీయ కమిటీ సభ్యునిగా పనిచేశారన్నారు. విలేకరుల సమస్యల మీద అనేక పోరాటాలలో పాల్గొని వారి హక్కులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బుర్రి కృష్ణారెడ్డి, ప్రత్తిపాటి వెంకట నాగరాజు, మురికిపూడి సర్వయ్య, ఎడ్ల భాస్కర్, ఆనంద్ కుమార్, సయ్యద్ సైదా, తమ్మిశెట్టి శ్రీరాములు, రామయ్య, ఎన్ కొండలు, పీ. కొండలు, సుబ్బారావు కోళ్లూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభలతో ప్రజా సమస్యలు పరిష్కారం

**- కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్** పచ్చదనం-పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామ సభలతో ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. శనివారం కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా గ్రామసభ నిర్వహించారు. దీనికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారమవుతాయని గ్రామస్తులకు సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. పైపులైన్ల మరమ్మత్తులు, ఓ నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి తొలగించాలన్నారు. ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుంటూ వర్షపు నీటిని సంరక్షించాలన్నారు. పచ్చదనం, పారిశుధ్యం, తాగునీరు, వైద్యం వంటి వంటి చిన్న అంశాలపై ప్రత్యేక దృష్టి సారించిన గ్రామాలే జాతీయస్థాయిలో అవార్డులు సాధిస్తున్నాయని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు,వసతులను సద్వినియోగం చేసుకొని సుస్థిర అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. నిబంధనల మేరకుచెత్త నిర్వహణ చేపట్టాలన్నారు.అవెన్యూ ప్లాంటేషన్,బడిబాట గురించి వివరించారు. హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి గ్రామస్తుల సమస్యలు పరిష్కరించాలని కార్యదర్శిని ఆదేశించారు. ఇన్చార్జి ఆర్డీవో వెంకటరెడ్డి మాట్లాడుతూ సర్ లో భాగంగా ఓటరు నమోదు జాబితా, మ్యాపింగ్ ప్రక్రియ గురించి వివరించారు.ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈఓ ఆనందం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గణపవరం డంపింగ్ యార్డు లో మంటలు

**- వెంటనే స్పందించిన టీడీపీ నాయకులు గంగా శ్రీనివాసరావు**

**పల్నాడు** చిలకలూరిపేట నాదెండ్ల మండలం గణపవరం శివారులో ఉన్న శివాలయం వద్ద. డంపింగ్ యార్డులో అర్ధరాత్రి మంటలు అక్కడి స్థానికులు ఫోన్ చేయగా వెంటనే స్పందించిన గణపవరం గ్రామ టీడీపీ నాయకులు, మాజీ మున్సిపల్ టీడీపీ పక్ష నాయకులు గంగా శ్రీనివాసరావు స్వంత వాటర్ ట్యాంకర్ తీసుకొని వచ్చి దగ్గర ఉండి మంటలు ఆర్పించడం జరిగింది.. డంపింగ్ యార్డు లో మంటలకు ఆకతాయిల పని అయ్యివుంటుందని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేశారు

# రెండు లారీలు ఢీకొని దగ్ధం..!!

**పుంగనూరు:** ముంబై-చెన్నై జాతీయ రహదారిపై సుగాలిమిట్ట వద్ద శుక్రవారం రాత్రి రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొని పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో చెన్నైకి చెందిన సయ్యద్ అలీ (39) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదం జరిగిన వెంటనే రెండు లారీల్లో మంటలు చెలరేగడంతో అవి పూర్తిగా దహనమయ్యాయి. స్థానికులు స్పందించి క్షతగాత్రుడిని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# వీఆర్వో ఆత్మహత్య

**- ఆలస్యంగా వెలుగులోకి సూసైడ్ నోట్**

**- అనారోగ్య సమస్యలతో మృతుడు విఆర్ఓ, ఉన్నతాధికారులే మృతికి కారణం**

**కర్నూలు** నగరం పరిధిలో అర్బన్ 30వ సచివాలయం గాంధీనగర్ వీఆర్వో సూసైడ్ చేసుకొని మరణించిన సంఘటన కర్నూల్ లో చోటు చేసుకుంది. తను అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాను అని, తనకు పని ఒత్తిడి తగ్గించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేకపోవడంతో తాను మృతి చెందుతున్నట్లు అధికారుల పేర్లతో సహా సూసైడ్ నోట్లో వివరించి ఆత్మహత్య చేసుకున్నారు. తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# నీటి గుంతలో పడి ఇద్దరు అక్కాచెల్లెళ్లు మృతి



ఖాజీపేట మండలం దుంపలగట్టు గ్రామంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వనం సంజన (18), వనం అర్చన (14) అనే అక్కాచెల్లెళ్లు నీటి గుంతలో పడి మృతి చెందారు.పందుల పెంపకమే జీవనాధారంగా ఉన్న వీరు ప్రతిరోజులాగే తమ తల్లి శివవాణి, తమ్ముళ్లు గౌతమ్, కార్తీక్లతో కలిసి పందులను మేపేందుకు గ్రామ శివారులోని నీటి గుంత వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు సంజన, అర్చన నీటి గుంతలో పడి మునిగిపోయారు.సమాచారం అందుకున్న గ్రామస్థులు వెంటనే సహాయక చర్యలు చేపట్టినా అప్పటికే ఇద్దరూ మృతి చెందినట్లు తెలిసింది. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు కుమార్తెలు దుర్మరణం చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

### ఉప్పుగూడా కాళికమాత ఆలయ భూమిపై అక్రమ నిర్మాణాలు, అక్రమ వసూళ్లపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

**హైదరాబాద్** పాతబస్తీ ఉప్పుగూడా ప్రాంతంలోని శ్రీ కాళికమాత ఆలయ భూమిని గతంలో రాష్ట్రీయ వానరసేన పోరాటం చేసి ఆక్రమణల నుండి కాపాడి తిరిగి దేవాలయానికి అప్పగించింది.అయితే ప్రస్తుతం కొంతమంది స్థానిక నాయకులు ఆలయ భూమిని తమ ఆధీనంలో ఉంచుకొని సుమారు 300 ఉఊఓఅ వాహనాలను పార్కింగ్ చేయిస్తూ లక్షల రూపాయల ఆదాయాన్ని పొందుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా పార్కింగ్ పేరుతో ఎటువంటి పారదర్శక అనుమతులు లేకుండా బౌండరీ వాల్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు సమాచారం అందుతోంది.ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పనులు కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఆలయ ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వ శాఖలపై ఉన్న నేపథ్యంలో వెంటనే సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలి.ఆలయ భూమి ద్వారా ఆదాయం పొందే అవకాశం ఉంటే, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చట్టబద్ధంగా టెండర్లు నిర్వహించి వచ్చే ఆదాయం పూర్తిగా దేవాలయ అభివృద్ధికి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ వానరసేన డిమాండ్ చేస్తోంది.అలాగే అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వ్యక్తులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, ఆలయ భూమిని పూర్తిగా పరిరక్షించాలని రాష్ట్రీయ వానరసేన ప్రభుత్వాన్ని కోరుతోంది.

# స్కూల్ పిల్లలతో గ్రీన్ ర్యాలీ




**సిద్దిపేట** స్ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులు ను పురస్కరించుకొని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలోని జిల్లా పరిషత్ హై స్కూల్, ఇందిరానగర్ కాలనీ స్కూల్ పిల్లలకు నాటు యూస్ సింగిల్ యూస్ ప్లాస్టిక్ మరియు సింగల్ యూస్ ప్లాస్టిక్ వాడడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి అనంతరం స్కూల్ పిల్లలతో గ్రీన్ ర్యాలీ తీయడం జరిగింది. ఈ ర్యాలీలో సేనో టు ప్లాస్టిక్ ప్లాస్టిక్ లిట్టర్ మరియు ఎన్విరాన్మెంటల్ అవేర్నెస్ స్లొగన్స్ చెప్పుకుంటూ ఇందిరానగర్ కాలనీ మరియు మార్కెట్ రోడ్ లో ర్యాలీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల ఏ. రాజ ప్రభాకర్ రెడ్డి టి. రవీందర్ కాలుష్య నియంత్రణ మండలి సహాయ పర్యావరణ శాస్త్రవేత్త,ఎన్జీవో సభ్యుడు, స్కూల్ టీచర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ శాస్త్రవేత్త రవీందర్ మాట్లాడుతూ. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం నేటి బాలలే రేపటి పౌరులు కావున స్కూల్ లోనే వారికి ఈ ప్లాస్టిక్ మహమ్మారిపై అవేర్నెస్ కల్పించడం వల్ల అనర్థాలు తెలుసుకొని దానికి ఆల్టర్నేట్ నార సంచులు బట్ట సంచులు మరియు విస్తీరాకులతో చూసిన ప్లేట్లు వుడెన్ గ్లాసెస్ వుడెన్ స్కూల్స్ మరియు క్లే పాత్రలు ఇలా పర్యావరణ అనుకూల పద్ధతులను అవలంబించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరు పర్యావరణ అనుకూల పద్ధతులను అవలంబిస్తూ భావితరాలకు మంచి గాలి, నీరు, నేల అందించాలని ఆయన తెలిపారు. అనంతరం అందరికీ క్యాపులు మరియు బట్ట సంచులు అందజేశారు.

## పిల్లల్లో వృద్ధి లోపాలు గుర్తించేందుకు ఏ ఐ టెక్నాలజీ..




చాగలమర్రి .. అంగన్వాడీలకు మండల స్థాయి శిక్షణ శిక్షణ ఇస్తున్న డాక్టర్ ప్రత్యూష ఆళ్లగడ్డ ప్రాజెక్టు పరిధిలోని చాగలమర్రి మండలంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం మహిళా శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్ సుశీల ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు ఏఐ ఆధారిత ఈ సి డి స్క్రీనింగ్ పై మండల స్థాయి ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణలో డాక్టర్ ప్రత్యూష పలు సూచనలు ఇచ్చారు. 0-6 ఏళ్ల పిల్లల్లో వయసుకు తగిన వృద్ధి లేని పిల్లలను గుర్తించి నవ చైతన్య యాప్ ద్వారా ఏఐ ఆధారిత ఈసిడి స్క్రీనింగ్ చేయాలని అంగన్వాడి టీచర్లకు తెలియజేశారు. చిన్నారుల్లో అభివృద్ధి సంబంధిత సమస్యలు, వైకల్యాలను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించే విధానంపై అవగాహన కల్పించారు. 0-6 వయసుగల పిల్లల బర్త్ డిఫెక్ట్స్, వృద్ధిలో లోపాలు గుర్తించి నమోదు చేయాలని తెలిపారు. భాషా బుద్ధి వికాసం, సామాజిక భావోద్వేగా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి పిల్లల వయసుకు తగిన అభివృద్ధిని పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సుశీల, హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, వివిధ అంగన్వాడి కేంద్రాల అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

## హోంగార్డు నాగిని రాజేందర్‌కు
# సీపీ గౌస్ ఆలం ఘన వీడ్కోలు



**కరీంనగర్** పోలీసు శాఖలో హోంగార్డుగా చేరి,35 సంవత్సరాలుగా నిస్వార్థంగా సేవలందించిన నాగిని రాజేందర్ పదవీ విరమణ సందర్భంగా శనివారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై, రాజేందర్ ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ. కమిషనరేట్ కేంద్రంలో సుదీర్ఘ కాలం పాటు విధులు నిర్వహించిన నాగిని రాజేందర్, తన 35 ఏళ్ల సర్వీసులో ఎంతో అంకితభావంతో, నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. పోలీసు శాఖలో హోంగార్డుల పాత్ర కీలకమని, క్షేత్రస్థాయిలో వారు అందించే సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన రాజేందర్ శేష జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో గడవాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది సమక్షంలో నాగిని రాజేందర్ కు పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. తన సర్వీసు కాలంలో తోటి సిబ్బందితో స్నేహపూర్వకంగా ఉంటూ,విధుల్లో క్రమశిక్షణ పాటించిన ఆయనను పలువురు అధికారులు అభినందించారు. ఈ వీడ్కోలు కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ హోంగార్డ్స్ శ్రీధర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రవి, కమిషనరేట్‌కు చెందిన ఇతర పోలీసు అధికారులు, హోంగార్డు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మునికూడలి ఘాట్‌ను జాతీయ స్థాయి మోడల్ గ్రామీణ పుష్కర్
# ఘాట్‌గా తీర్చిదిద్దాలి:డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

**జూన్ 18 - 20 మధ్య ఉప ముఖ్యమంత్రి పర్యటన నాటికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి:కలెక్టర్ కీర్తి చేకూరి**



రాజమహేంద్రవరం (ప్రశ్న న్యూస్) పుష్కరాలు నేపథ్యంలో మునికూడలి గ్రామాన్ని జీరో లిక్విడ్ డిశ్చార్జ్, ఆధ్యాత్మిక-- పర్యాటక కేంద్రంగా సమగ్ర అభివృద్ధికి కార్యాచరణ సిద్ధం చేయాలని , భవిష్యత్ కోసం దిక్సూచిగా నిలపాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. శనివారం అమరావతి నుంచి నిర్వహించిన సమీక్ష సమావేశంలో పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం సిద్ధం చేస్తున్న ప్రతిపాదనలపై విస్తృతంగా చర్చించి పలు సూచనలు చేశారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ వై మేఘా స్వరూప్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ మునికూడలి ఘాట్‌ను జాతీయ స్థాయిలో ఆదర్శ గ్రామీణ పుష్కర్ ఘాట్‌గా అభివృద్ధి చేసేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. మునికూడలి ఘాట్ అభివృద్ధిని కేవలం పుష్కర ఘాట్ పరిమితిలో కాకుండా ఆధ్యాత్మిక, పర్యాటక, పర్యావరణ పరిరక్షణ అంశాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. శాఖలు అత్యంత మధ్య సమన్వయం చేస్తూ జాతీయ స్థాయిలో అధ్యయన అంశంగా నిలిచే విధంగా రూపుదిద్దాలని ఉప ముఖ్యమంత్రి కలెక్టర్ కు సూచించారు. ముఖ్యంగా "జీరో లిక్విడ్ డిశ్చార్జ్" లక్ష్యంగా మునికూడలి గ్రామంలో మురుగునీరు, వర్షపు నీటి నిర్వహణకు సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయాలని, గోదావరి నదిలోకి ఎటువంటి మురుగు నీరు చేరకుండా "మ్యాజిక్ డ్రెయిన్" విధానంతో ఏకీకృత ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు.

**ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ,**


మునికూడలి గ్రామంలో ఉన్న సోమేశ్వర స్వామి, వేణుగోపాల స్వామి ఆలయాల ఆధ్యాత్మిక విశిష్టతను దృష్టిలో ఉంచుకొని "శివరూపాయ విష్ణవే -- విష్ణురూపాయ శివవే" అనే భావనకు అనుగుణంగా ఘాట్ అభివృద్ధి చేపడుతున్నట్లు వివరించారు. భక్తులు, పర్యాటకులకు ఉపయోగపడే విధంగా ధ్యాన మందిరం తరహా ఆధ్యాత్మిక కేంద్రం, విశ్రాంతి వసతులు, హారతి వేదికలు, పర్యాటక సదుపాయాలను అభివృద్ధి చేసే అవకాశాలపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మునికూడలి ప్రాంతానికి ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను కూడా సమావేశంలో వివరించారు. ప్రాచీన కాలంలో 11వ, 14వ శతాబ్దం యొక్క ప్రశస్తం ఇక్కడ నిమిదికృతమై ఉందన్నారు. నైమిశారణ్య మునుల కూటమిగా ఇక్కడ వొచ్చి హోమాలు జపాలు నిర్వహించే క్రమంలో ప్రసిద్ధి చెందిన ఈ ప్రాంతం చారిత్రక గ్రంథాలలో ప్రస్తావించబడిందన్నారు. సోమేశ్వర స్వామి, వేణుగోపాల స్వామి ఆలయాలు ప్రత్యేక ఆధ్యాత్మిక కేంద్రాలుగా ఇక్కడ వెలిశాయని పేర్కొన్నారు పుష్కరాల దృష్ట్యా కోరుకొండ మండలం ముగ్గళ్ల, కాటవరం, కూనవరం, పోలవరం ప్రాంతాలతో పాటు ఉత్తరాంధ్ర, ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల రాకపోకలను దృష్టిలో ఉంచుకొని పార్కింగ్ స్థలాలు, హోల్డింగ్ ఏరియాలను గుర్తించినట్లు తెలిపారు. గోకవరం -- తొర్రేడు మార్గం ద్వారా మునికూడలికి చేరుకునే ప్రాంతాల్లో ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్ సదుపాయాలపై కూడా ప్రణాళిక రూపొందిస్తున్నా మన్నారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ, పుష్కర స్నానాల కోసం కోర్ బాత్ ఏరియాలో నాలుగు అడుగుల మేర నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం, పుష్కరాల నాటికి గ్రామంలో ప్రతి ఇంటికి మరుగుదొడ్డి, తాగునీటి ట్యాప్ కనెక్షన్ అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామంలోని సుమారు 450 కుటుంబాల మౌలిక సదుపాయాల స్థితిగతులపై ఇంటింటి సర్వే నిర్వహించి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, దేవాదాయ, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు, ఆర్ అండ్ బి శాఖలు సమన్వయంతో బుధవారం నాటికి ఏకీకృత కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పండ్ల చెట్లతో కూడిన విస్తృత హరితాభివృద్ధి, బండ్ విస్తరణ, నదీ తీర సుందరీకరణ వంటి అంశాలను కూడా ప్రణాళికలో చేర్చాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ మునికూడలి ఘాట్ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదిత ప్రణాళికలు, మౌలిక వసతుల వివరాలను వివరించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలనా సందర్భంగా గుర్తించినా పలు కీలక అంశాలు ఉప ముఖ్యమంత్రి దృష్టిలో పెట్టండి జరిగింది. మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా మునికూడలి గ్రామాన్ని ఒక ఆధ్యాత్మిక కేంద్రం గా తీర్చి దిద్దే క్రమంలో ప్రతిపాదిస్తున్న అంశాలతో కూడి ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగింది అని వివరించారు. ఇందుకు సంబంధించి కార్పొరేట్ సంస్థలతో నిధులు సమీకరించి అభివృద్ధి చేసి, భవిష్యత్తు లో పర్యటక కేంద్రం గా తీర్చిదిద్దేలా ఉండాలని, అందుకు తన వంతుగా సహాయ సహకారాలు అందించడం జరుగుతుంది అని పేర్కొన్నారు.. ఈ నెల 18 నుంచి 20వ తేదీ మధ్య ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో మునికూడలి గ్రామానికి సంబంధించిన విజువల్ డాక్యుమెంటేషన్ సిద్ధం చేయాలని పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణ తేజ్ కోరారు. అభివృద్ధి ప్రతిపాదనలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తుది రూపు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో పుష్కర్ డిప్యూటీ కలెక్టర్లు, ఇరిగేషన్, పంచాయతీరాజ్, దేవాదాయ, పోలీసు, రెవెన్యూ, ఆర్ అండ్ బి తదితర శాఖల అధికారులు, మునికూడలి ఆలయ అర్చకులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## రేకులపల్లిలో విషాదం కరెంట్ షాక్‌తో బర్రె మృతి
**- కాపరికి తీవ్ర గాయాలు**



ధర్పల్లి (ప్రశ్న న్యూస్ )నిజామాబాదు జిల్లా ధర్పల్లి మండలంలోని రేకులపల్లి గ్రామ శివారులో విద్యుత్ షాక్ ఘటన చోటుచేసుకుంది. ధర్పల్లికి చెందిన గంగాధర్ అనే వ్యక్తి బుధవారం ఈ ఘటన జరిగింది. నిర్లక్ష్యం కారణంగా పొలంలో విద్యుత్ తీగలు తగలడంతో ఒక బర్రె అక్కడికక్కడే మృతి చెందింది. బర్రెలను మేపుతున్న కాపరి కూడా కరెంట్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించి క్షతగాత్రుడిని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పొలాల వద్ద విద్యుత్ తీగల విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

## ప్రైవేటు పాఠశాలలు వద్దు..
# ప్రభుత్వ ఎఫ్ పాఠశాలలే ముద్దు




ధర్పల్లి( ప్రశ్న న్యూస్ ) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో హొన్నాజిపేట గ్రామ అంబేద్కర్ మాదిగ యువజన సంఘం ఆధ్వర్యంలో జూన్ 1, 2026న సర్వసభ్య సమావేశం లో సంఘం అధ్యక్షుడు అతికెల సదానంద్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు పంపలేము ప్రభుత్వ పాఠశాలలే బాగున్నాయన్నారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు, మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నారు. అలాగే బస్తాలు, టిఫిన్ బాక్సులు, వాటర్ బాటిళ్లు, పుస్తకాలు తదితర వస్తువులను కూడా అందజేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధ్యక్షుడు అరికెల సదానంద్, ఉపాధ్యక్షుడు అరికెల భూషణ్,ప్రధాన కార్యదర్శి నక్క గంగ కుమార్, సంయుక్త కార్య పెండ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో
# భాగంగా 14వ వార్డులో వార్డు సభ



గజ్వేల్( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజాపాలన -- 99 రోజుల ప్రగతి ప్రణాళిక, మన వార్డు -- మన సభ" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 14వ వార్డు భారత్‌నగర్ గల్లీలోని వినాయక మండపం వద్ద వార్డు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, పారిశుద్ధ్య నిర్వహణ, మిషన్ భగీరథ తాగునీటి సమస్యలు, విద్యుత్ సరఫరా, వీధి దీపాలు, డబుల్ బెడ్‌రూం ఇండ్ల సమస్యలు తదితర అంశాలను వార్డు ప్రజలు సభ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ గణేష్ మాట్లాడుతూ ప్రజలు ఇంటి పన్నులు, నీటి బిల్లులు సకాలంలో చెల్లించాలని, చెత్తను చెత్త బండిలోనే వేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కౌన్సిలర్ గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్ మాట్లాడుతూ కొన్ని గల్లీల్లో మురుగునీటి కనెక్షన్లు యూజీడీకి ఇవ్వకపోవడంతో దుర్వాసన సమస్య ఏర్పడుతోందని, వెంటనే కనెక్షన్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే మోరీలలో పేరుకుపోయిన చెత్తను త్వరితగతిన తొలగించాలని, వర్షాకాలంలో బురదమయంగా మారుతున్న గల్లీల్లో సీసీ రోడ్లు నిర్మించాలని, మోరీలపై స్లాబులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. భువనగిరి బాబు గల్లీలో అధ్వాన్నంగా ఉన్న ఇరుకు రహదారిని వార్డు సభ అనంతరం కౌన్సిలర్‌తో కలిసి కమిషనర్ పరిశీలించారు. అత్యవసర అవసరం ఉన్న ప్రాంతాల్లో సీసీ రోడ్లకు త్వరలోనే మంజూరు కల్పించేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. అనంతరం చెత్త సేకరణను ప్రైవేటీకరించడం, రూ.100 వినియోగదారుల రుసుము వసూలు చేయడాన్ని నిలిపివేయాలని కోరుతూ వార్డు ప్రజలు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సామ ప్రశాంతి, ఆర్‌పీ లావణ్య, అనసూయ, మల్లమ్మ, భూలక్ష్మి, ఆస్మా, రేష్మా, షకీల్ బాయ్, కొమురవెల్లి వెంకటేశం, వజీర్ ఖాన్, మహిపాల్ రెడ్డి, ఖదీర్, వార్డు ప్రజలు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యోగాంధ్ర కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి..
**- ఎంపీడీవో**



**చాగలమర్రి** కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో యోగేంద్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా, ప్రణాళిక బద్ధంగా సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేద్దామని ఎంపీడీవో, ప్రత్యేక అధికారి తాహిర్ హుస్సేన్ మండల కార్యదర్శులను, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ, శారీరక మానసిక శ్రేయస్సుకోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యోగ వ్యాసానికి ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. యోగ పట్ల అవగాహన పెంపొందించి ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చే లక్ష్యంతో జూన్ 7 నుంచి 21 వరకు యోగ ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

సమావేశం నందు అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా అభ్యాసకుల పేర్లు నమోదుపై ఉపాధి హామీ సిబ్బంది, వెలుగు సిబ్బంది కి తగు సూచనలు ఇచ్చారు. 3875 నిరక్షరాశులను గుర్తించి వారి పేర్లు ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. యోగ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా 17 సచివాలయాలకు 11675 మంది శిక్షకులకు గాను 289 ట్రైనర్స్ తో ఈనెల 21 వరకు యోగాంధ్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య సూపర్వైజర్ మాధవ్, ఏవో రాజేంద్రప్రసాద్, స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు డిప్యూటీ ఎంపీడీవో తారకేశ్వరి, వెలుగు ఏపీఎం నాగమ్మ, రాజకుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు టెక్నికల్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

# ప్రీ ప్రైమరీ, పీఎం శ్రీవిద్యను కేంద్రాలను వెంటనే రద్దు చేయాలి.

**వాటిని అంగన్వాడీలకు అప్పజెప్పాలి**

**జిల్లా డిడబ్ల్యూ కు వినతి పత్రం అందజేత**



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) ప్రీ ప్రైమరీ పీఎం శ్రీవిద్య కేంద్రాలను అంగన్వాడీలకే అప్పచెప్పాలని వాటిని ప్రత్యేకంగా నిర్వహించే పద్ధతిని ప్రభుత్వం మానుకోవాలని, వాటిని అంగన్వాడీ లకు అప్పగించాలని కోరుతూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డి డబ్ల్యూ కు వినతి పత్రం అందజేశారు..ప్రీ ప్రైమరీ పీఎం శ్రీవిద్య కేంద్రాలను అంగన్వాడీలకే అప్పచెప్పాలని వాటిని ప్రత్యేకంగా నిర్వహించే పద్ధతిని ప్రభుత్వం మానుకోవాలని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షరాలు జి సునీత డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతన విద్య విధానంలో భాగంగా అంగన్వాడీల కేంద్రాలకు ఎసురు పెట్టే కార్యక్రమానికి పూనుకొన్నదని విమర్శించారు.అందులో భాగంగా ప్రీ ప్రైమరీ స్కూల్ ను, పిఎం శ్రీ విద్యను ప్రవేశపెడుతున్నారని అన్నారు.అంగన్వాడీలకు నష్టం కలిగించే ప్రీ ప్రైమరీ స్కూల్ పి.ఎం.శ్రీ విద్యను గ్రామములో అమలు చేయమని వాటిని అంగన్వాడీ లకు అప్పజెప్పాలని కోరుతూ తీర్మాణం చేసి రాష్ట్ర ప్రభుత్వం పంపాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం పాటించడం దారుణమని విమర్శించారు. ప్రీ ప్రైమరీ, పీఎం శ్రీ కేంద్రాలను అంగనవాడలకే అప్పచెప్పుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.30 నుండి 40 సంవత్సరాలగా సేవలందిస్తున్న అంగన్వాడి టీచర్లకు, హెల్పర్లకు ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న ప్రీ ప్రైమరీ పాఠశాలలతో వారి ఉద్యోగాల ఉనికికే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.అంగన్వాడీలకు ప్రమాదంగా మారిన ప్రీ ప్రైమరీ ,పి.ఎం.శ్రీ 4,131 కేంద్రాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకుల తదితరులు పాల్గొన్నారు

## ఫోటోగ్రాఫర్లు సాంకేతిక మార్పులకు అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవాలి: తూంకుంట నర్సారెడ్డి



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) గజ్వేల్ మండల ఫోటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న ప్రతిష్టాత్మక వెడ్డింగ్ ఫోటోగ్రఫీ ఽ ఎఐ వర్క్‌షాప్‌కు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సంఘం అధ్యక్షుడు బొల్లిబత్తుల నాగరాజు నేతృత్వంలోని కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు.ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ, సాంకేతిక రంగంలో వస్తున్న వేగవంతమైన మార్పులకు అనుగుణంగా ఫోటోగ్రాఫర్లు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలని సూచించారు. ఆధునిక ఫోటోగ్రఫీతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) వంటి సాంకేతిక అంశాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా వృత్తిపరంగా మరింత ముందుకు వెళ్లే అవకాశాలు ఉంటాయని తెలిపారు.ఫోటోగ్రాఫర్లకు ఉపయోగపడే ఈ వినూత్న వర్క్‌షాప్‌ను అభినందించిన ఆయన, సంఘ భవన నిర్మాణానికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

## పట్టువిడుపులు వద్దు దాంపత్యమే ముద్దు.సివి.ఆనంద్




కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) మల్కాజ్ గిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో మీ సురక్ష పేరిట బోయిన్ పల్లిలో నిర్వహించిన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి మహిళా విభాగ డీజీ:చారు సిన్హా, మల్కాజిగిరి సిపి: సుమతి, తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ హెడ్ శ్రీ దేవి తదితరులు హాజరయ్యారు."కలిసి ఉంటే కలదు సుఖం"అనే నినాదంతో భార్యాభర్తల మధ్య జరిగే వివాదాలను, గొడవలను సర్ది చెబుతూ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న కౌన్సిలింగ్ సెంటర్ల నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించి వారిని సత్కరించారు. మారుతున్న జీవన ప్రమాణాలు,ప్రస్తుత సమాజ తీరుతెన్నుల నేపథ్యంలో దంపతుల మధ్య మనస్పర్ధలు బేధాభిప్రాయాలు వస్తున్నట్లు తెలిపారు.దంపతుల మధ్య వచ్చే వైరుధ్యాలను మహిళా పోలీస్ స్టేషన్లలో పరిష్కరించడంతో పాటు, కౌన్సిలింగ్ ఏర్పాటు చేసి తిరిగి వారి దాంపత్య జీవితాన్ని ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.మహిళల కోసం ప్రత్యేకంగా కౌన్సిలింగ్ సెంటర్లు భరోసా కేంద్రాలతో పాటు దేశంలో ఎక్కడా లేని విధంగా షీ టీమ్స్ ఏర్పాటు చేసి మహిళల శాంతిభద్రతల పట్ల ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. నాలుగు కమిషనరేట్ల పరిధులలో గత పది సంవత్సరాలుగా 30 కౌన్సిలింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి 50 వేల కౌన్సిలింగ్ సెషన్ లో నిర్వహించి 6700 మంది దంపతుల దాంపత్యాన్ని కాపాడినట్లు తెలిపారు.నేటి తరానికి చెందిన భార్యాభర్తలు అహంభావంతో గొడవలు పడుతూ ప్రతి చిన్న విషయానికి విడిపోయేంత దూరం వెళ్ళిపోతున్నారని ఆయన అన్నారు.దంపతుల మధ్య మనస్పర్ధలను, ఇబ్బందులను దూరం చేసి వారి మధ్య ఏర్పరిచేందుకు కౌన్సిలింగ్ కేంద్రాలు ఎంతగానో దోహదపడుతున్నాయని అన్నారు.దంపతుల మధ్య అన్యోన్య జీవితానికి ఒకరి నొకరు అర్థం చేసుకుంటూ గొడవలు జరిగినప్పుడు కోపోద్రిక్తులు కాకుండా సహనంతో వ్యవహరిస్తే భార్యాభర్తల మధ్య దూరం తగ్గుతుందని చెప్పారు.ఈ కార్యక్రమం ద్వారా సుమారు "150" జంటలు ఏకమైనట్లు ఆయన తెలిపారు.ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు మల్కాజ్ గిరి కమిషనరేట్ సిపిని, మహిళా విభాగ పోలీసు సిబ్బందిని సివి: ఆనంద్ అభినందించారు.

# సైక్లింగ్ ట్రాక్‌తో ట్రాఫిక్ కష్టాలు

**- రోడ్లు ఇరుకై వాహనదారులకు నరకయాతన**

**- ద్విచక్ర వాహనాలకు ప్రమాదకరంగా మారిన సైక్లింగ్ ట్రాక్‌లు**

**- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు**

**- మెట్టుగూడ--తార్నాక మార్గంలో రోజూ ట్రాఫిక్ అవస్థలు**



తార్నాక (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలో పర్యావరణ హిత రవాణాను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సైక్లింగ్ ట్రాక్‌లు ఇప్పుడు వాహనదారులకు తలనొప్పిగా మారాయని స్థానికులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మెట్టుగూడ నుండి తార్నాక వరకు ఇరువైపులా ఏర్పాటు చేసిన సైక్లింగ్ ట్రాక్‌ల కారణంగా ఇప్పటికే ఇరుకుగా ఉన్న రహదారులు మరింత కుదించబడి ట్రాఫిక్ సమస్యలు తీవ్రరూపం దాల్చాయి. రోజురోజుకు పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా రోడ్ల విస్తరణ జరగకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సైక్లింగ్ ట్రాక్‌ల కోసం రహదారి విస్తీర్ణంలో గణనీయమైన భాగాన్ని కేటాయించడంతో వాహనాల రాకపోకలకు అందుబాటులో ఉన్న స్థలం తగ్గిపోయింది. ఫలితంగా పీక్ అవర్స్‌లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. వాస్తవానికి సైక్లింగ్ ట్రాక్‌లను ఉపయోగించే సైక్లిస్టులు అసలు లేరని స్థానికులు పేర్కొంటున్నారు. ట్రాక్‌లు ఖాళీగా ఉండగా రహదారిపై వాహనాలు బారులు తీరుతున్న దృశ్యాలు నిత్యం కనిపిస్తున్నాయని పేర్కొంటున్నారు. రోడ్డు సరిపోకపోవడంతో అనేక మంది ద్విచక్ర వాహనదారులు సైక్లింగ్ ట్రాక్‌లలోనే ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో అప్పటికే కంగా చేసిన ఫుట్పాత్ వ్యాపారులు, ద్విచక్ర వాహనదారుల మధ్య ప్రమాదాల ముప్పు పెరుగుతోందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ సమస్యపై గతంలోనే పలుమార్లు సికింద్రాబాద్ జోన్ జోనల్ కమిషనర్‌తో పాటు మున్సిపల్ అధికారులకు వాహనదారులు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. సైక్లింగ్ ట్రాక్‌లను తొలగించి రోడ్లను విస్తరించాలని, ట్రాఫిక్ భారాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలని కోరినా అధికారులు స్పందించలేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ప్రజల ఇబ్బందుల కంటే ప్రాజెక్టుల నిర్వహణకే అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉదయం, సాయంత్రం వేళల్లో మెట్టుగూడ--తార్నాక మార్గంలో ప్రయాణించడం వాహనదారులకు పెద్ద సవాలుగా మారింది. అంబులెన్స్‌లు, అత్యవసర సేవల వాహనాలు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నాయని స్థానికులు తెలిపారు. ఒకవైపు ట్రాఫిక్ రద్దీ, మరోవైపు ఇరుకైన రహదారులు ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. నగరవ్యాప్తంగా ఏర్పాటు చేసిన సైక్లింగ్ ట్రాక్‌లపై సమగ్ర అధ్యయనం చేసి ఉపయోగం లేని వాటిని పూర్తిగా తొలగించి రోడ్డు విస్తరణ చేయాలని, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ అధికారులు నిర్ణయాలు తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. ఉపయోగంలో లేని సైక్లింగ్ ట్రాక్‌లను వెంటనే తొలగించి రహదారులను విస్తరించడం ద్వారా ట్రాఫిక్ సమస్యలకు కొంతమేర పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడుతున్నారు.

ప్రజల సమస్యలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఇప్పటికైనా స్పందించి మెట్టుగూడ--తార్నాక మార్గంలోని ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు కోరుతున్నారు. నగరాభివృద్ధి పేరుతో చేపట్టిన ప్రాజెక్టులు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగించే విధంగా మారితే వాటిని వెంటనే తొలగించే అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# నయా టెక్నాలజీతో "నేపాల్ గ్యాంగ్"అరెస్టు: సుమతి

**- జవహర్‌నగర్ దోపిడీ కేసు ఛేదన.. కుప్రసిద్ధ నేపాలీ ముఠా అరెస్ట్**

**- ఇళ్లల్లో పని చేసే వాళ్ల పై తస్మాత్ జాగ్రత్త, నిందితులు కోసం"255" సీసీ కెమెరాల్లో అన్వేషణ:సిపి**



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) మల్కాజిగిరి కమీషన్ రేట్ పరిధిలో ఉన్న ప్రజలు పని వాళ్లతో తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని, ఏమైనా అనుమానాలు ఉత్పన్నమయితే వేంటనే పోలీసులకు సమాచారం అందించాలని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతిమల్కాజిగిరి జోన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. అలాగే గత నెలజవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన భారీ గృహ దోపిడీ కేసును మల్కాజ్‌గిరి పోలీసులు ఛేదించారు.ఈ కేసులో ప్రమేయం ఉన్న నేపాలీ ముఠాకు చెందిన ప్రధాన నిందితులు మీనా,రాజేష్, డేనియల్ చారో అలియాస్ చాంగ్,కిరణ్‌లను అరెస్ట్ చేసి, దొంగిలించిన బంగారం,వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం,కౌకూర్‌లోని మోహన్స్ గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో నివాసముంటున్న అంతర్జాతీయ ఆర్బిట్రేటర్ మురళీ మోహన్ నరసిపురం ఇంట్లో మే 11 రాత్రి ఈ దోపిడీ జరిగింది.గత కొన్ని నెలలుగా జవహర్‌నగర్ ప్రాంతంలో పనిచేస్తున్న నేపాలీ కార్మికులు మీనా,రాజేష్‌లు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దోపిడీకి పథకం రచించారు.ఈ క్రమంలో ఇతర నేపాలీ కార్మికులతో కలిసి ముఠాను ఏర్పాటు చేసి,సబీనా అనే మహిళను ఫిర్యాదు దారుడి ఇంట్లో పనిమనిషిగా చేర్పించారు.మే 11న మీనా పుట్టినరోజు వేడుకల పేరుతో ఇంట్లోకి ప్రవేశించిన నిందితులు,వృద్ధ దంపతులను బంధించి మత్తు పదార్థం ఇచ్చి స్పృహ కోల్పోయేలా చేశారు. అనంతరం ఇనుప రాడ్లతో బెదిరించి అల్మారాలు పగులగొట్టి సుమారు 60 తులాల బంగారు ఆభరణాలు,15 కిలోల వెండి వస్తువులు,రెండు మొబైల్ ఫోన్లు,3 వేల అమెరికన్ డాలర్లు నగదుతో సహా విలువైన వస్తువులను దోచుకెళ్లిన విషయం విదితమే.నేరం అనంతరం ఆటోరిక్షా,స్కూటర్‌లలో పరారైన నిందితులు, తరువాత రెండు టాక్సీల్లో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ చేరుకుని దేశం విడిచి వెళ్లేందుకు ప్రయత్నించినట్లు దర్యాప్తులో తేలింది.కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మల్కాజ్‌గిరి పోలీసులు ఎల్ అండ్ ఓ,ఎస్ఓటీ,సీసీఎస్ విభాగాలతో కలిపి ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.సుమారు 255 సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను విశ్లేషించి, బెంగళూరు,ఢిల్లీ,ముంబైతో పాటు నేపాల్ సరిహద్దు ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టారు.నేరం జరిగిన ఐదు రోజుల్లోనే నలుగురు నిందితులను అరెస్ట్ చేసిన మల్కాజిగిరి పోలీసులు,అనంతరం మరో 20 రోజుల పాటు దేశవ్యాప్తంగా ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి మిగిలిన నిందితులను కూడా అదుపులోకి తీసుకోవడం విశేషం.దర్యాప్తులో ప్రధాన నిందితులు మీనా,రాజేష్‌లు గతంలో మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన రాత్రిపూట ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనం చేసిన కేసులో కూడా ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు.శాస్త్రీయ ఆధారాలు,వేలిముద్రల సాయంతో వారి ప్రమేయాన్ని నిర్ధారించారు.

**"మీ సురక్ష" కార్యక్రమం ప్రారంభం:**

ఈ ఘటన నేపథ్యంలో నివాస కాలనీలు, అపార్ట్‌మెంట్ సముదాయాల భద్రతను మరింత బలోపేతం చేయడానికి మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ "మీ సురక్ష" కార్యక్రమాన్ని ప్రారంభించింది.ఈ కార్యక్రమం ద్వారా గృహ సేవకులు,పనిమనుషులు, డ్రైవర్లు,సంరక్షకులు, వాచ్‌మెన్‌లు తదితర సిబ్బంది వివరాలను సేకరించి ధృవీకరిస్తున్నారు. ఇప్పటివరకు 39,270 మంది గృహ సిబ్బంది వివరాలు నమోదు చేయగా,వారిలో 1,276 మంది నేపాలీ జాతీయులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

ప్రజలు తమ వద్ద పనిచేసే గృహ సిబ్బంది వివరాలను పోలీసులకు అందించి, భద్రతా చర్యల్లో భాగస్వాములు కావాలని పోలీస్ కమిషనర్ బి.సుమతి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి జోన్ డిసిపి శ్రీధర్, జవహర్ నగర్ ఏసిపి చక్రపాణి,సిఐ: సైదులు,డిఐ.శ్రీనివాస్ గౌడ్,
ఎస్సై అద్రిస్ అలీ,ఎస్ఓటి, సిసిఎస్ అధికారులు పాల్గొన్నారు.

## శ్రీశైలం దేవస్థానం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన: ఈవో శ్రీనివాసరావు



శ్రీశైలం (ప్రశ్న న్యూస్) పరిపాలనాంశాల పరిశీలనలో భాగంగా కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కార్యాలయ భవనములోని సమావేశమందిరంలో జరిగిన ఈ సమీక్షలో అన్ని విభాగాల యూనిట్ అధికారులు పర్యవేక్షకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమాన్ని దేవస్థానం పరిధిలో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లుగా ఈ నెల 8వ తేదీన గంగాధర మండపం వద్ద జరిగే యోగాంధ్ర కార్యక్రమానికి ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్నీ ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా అంతర్జాతీయ యోగాదినోత్సవం సందర్భంగా జూన్ 21వ తేదీన జరగనున్న అంతర్జాతీయ యోగాదినోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లన్నీ సమగ్రంగా ఉండాలన్నారు. యోగా శిక్షణా కార్యక్రమాన్ని 20వ తేదీ వరకు కూడా ప్రతీరోజు నిర్వహించాలన్నారు. యోగా కార్యక్రమాన్ని ప్రణాళికబద్ధంగా, సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు.ఈ యోగా కార్యక్రమాలలో స్థానికులతో పాటు యాత్రికులను కూడా భాగస్వాములను చేయాలన్నారు. అనంతరం రానున్న వర్షాకాలం సందర్భంగా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా డార్మిటరీలు, అన్ని భవనాలలోనూ ఎలక్ట్రికల్ వైరింగ్ పనులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. షార్టు సర్క్యూట్ జరగకుండా ఉండేందుకు తరుచుగా ఎలక్ట్రికల్ వైరింగ్ పనులను తనిఖీ చేస్తుండాలన్నారు. అన్నీ డార్మిటరీలలో కూడా విద్యుద్దీపాలు మరియు ఫ్యాన్లు సజావుగా పనిచేసేలా తగు చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. డార్మిటరీ పరిసరాలలో పారిశుద్ధ్య నిర్వహణ సజావుగా ఉండాలన్నారు. పరిసరాలలో చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రతాచర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా పిచ్చిమొక్కలు తొలగించేందుకు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలన్నారు. అదేవిధంగా అన్ని డార్మిటరీలలో కూడా అన్నీ మరమ్మతులు చేపట్టాలన్నారు. శౌచాలయాల శుభ్రతపట్ల నిరంతరం శ్రద్ధవహిస్తుండాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# ఐదు నెలలుగా నిర్లక్ష్యం

## - ప్రమాదకరంగా మారిన డ్రైనేజీ

**- డ్రైనేజీపై కప్పు లేక ప్రమాదాలకు నిలయంగా మారిన ఎస్సీ కాలనీ రహదారి**

**- తక్షణమే రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని మల్లాపూర్ గ్రామం 4వ వార్డు (ఎస్సీ కాలనీ)లో మెయిన్ రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీపై కప్పు లేకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఐదు నెలలుగా ఈ సమస్య కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. కాలనీలో ప్రధాన రహదారి పక్కనే డ్రైనేజీ తెరిచి ఉండటంతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు, పాదచారులు నిత్యం భయాందోళనల మధ్య రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో, వర్షాకాలంలో డ్రైనేజీ నీటితో నిండిపోవడంతో ప్రమాదం మరింత పెరుగుతోందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పలువురు కాలనీ వాసులు మాట్లాడుతూ, గత ఐదు నెలలుగా సమస్యను పలుమార్లు గ్రామపంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున వెంటనే డ్రైనేజీపై సిమెంట్ స్లాబ్‌లు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించాలని కోరారు. సమస్యను నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.

# ‘సత్తెంద్రుడు మారుదు వానిలై’

# మూవీ రివ్యూ!



కోలీవుడ్ కథానాయకులలో ‘జై’ తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్నాడు. తన బాడీ లాంగ్వేజ్ కి తగిన పాత్రలను ఎంచుకుంటూ ముందుకు వెళుతున్నాడు. తమిళంలో ఆయన చేసిన సినిమానే ‘సత్తెంద్రుడు మారుదు వానిలై’. మీనాక్షి గోవిందరాజన్ కథానాయికగా నటించిన ఈ సినిమా, ఒక రొమాంటిక్ థ్రిల్లర్. బాబు విజయ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, మే 15వ తేదీన థియేటర్లకు వచ్చింది. ఈ నెల 5వ తేదీ నుంచి ‘ఆహా’లో స్ట్రీమింగ్ అవుతోంది. జానకి (మీనాక్షి గోవిందరాజన్) మంచి విద్యావంతురాలు .. అందమైన యువతి. ఆమెపై ఒక రాజకీయనాయకుడి కన్ను పడుతుంది. దాంతో అతను తెలివిగా ఒక పథకం వేస్తాడు. జానకి తండ్రికి కూడా పదవిని కట్టబెట్టి, అందుకు బదులుగా ఆమెను తనకిచ్చి పెళ్లి చేయమని కోరతాడు. అందుకు జానకి తండ్రి సిద్ధమవడంతో, అది ఇష్టం లేని ఆమె ఇల్లొదిలి వెళ్లిపోతుంది. ఆ సమయంలోనే ఆమెకి దగ్గర కావడానికి రణేశ్ ప్రయత్నిస్తూ ఉంటాడు. జానకి పేరుతో 300 ఎకరాల భూమి ఉంటుంది. అందుకోసమే రణేశ్ ఆమెను వలలోకి లాగే ప్రయత్నం చేస్తుంటాడు. అతను స్వార్థంతోనే తన పట్ల ప్రేమను నటిస్తున్నాడని గ్రహించిన జానకికి, అదే సమయంలో రామచంద్రన్ (జై) పరిచయమవుతాడు. రణేశ్ టార్చర్ నుంచి తప్పించుకోవడం కోసం ఆమె రామచంద్రన్ ను వివాహం చేసుకుంటుంది. రామచంద్రన్ అనాథగా ఒక శరణాలయంలో పెరుగుతాడు. సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా పనిచేస్తూ ఉంటాడు. జానకితో హనీమూన్ కి వెళ్లిన అతను అక్కడ సరదాగా గడుపుతాడు. అక్కడే అతను తొలిసారిగా ‘చక్రవర్తి’ (గరుడ రామ్) ను చూస్తాడు. చక్రవర్తి చేతిలో చాలా రిసార్ట్స్ ఉంటాయి. కొత్త జంటలకు ఆఫర్ పేరుతో రిసార్ట్స్ నిర్వహిస్తూ ఉంటాడు. పడక గదుల్లోని శృంగార సన్నివేశాలను రహస్య కెమెరాలతో చిత్రీకరించి, ఆ వీడియోస్ తో కోట్ల రూపాయల బిజినెస్ చేస్తుంటాడు. చక్రవర్తి చేసే బిజినెస్ .. అతని చేతిలో తమ వీడియో కూడా ఉందనే విషయం రామచంద్రన్ కి తెలుస్తుంది. అప్పుడు అతను ఏం చేస్తాడు? అతని కారణంగా జానకి ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొంటుంది? అనేది మిగతా కథ.

వయసుమళ్లిన ఒక రాజకీయనాయకుడికి రెండో భార్యగా వెళ్లడం ఇష్టం లేని జానకి, ఇల్లొదిలి వెళ్లిపోతుంది. ప్రేమ పేరుతో మోసం చేయడానికి ప్రయత్నించిన ఒక యువకుడి నుంచి తప్పించుకోవడం కోసం, ఆమె రామచంద్రన్ చేయందుకుంటుంది. అతను అనాథ అని తెలిసి ఆమె పెద్దగా ఆశ్చర్యపోదు. కానీ ఆమె ఒక రాజకీయనాయకుడి కూతురని తెలిసి అతను షాక్ అవుతాడు. హనీమూన్ కి వెళ్లిన ఈ జంట ఎలాంటి చిక్కుల్లో పడతారనే ఒక ఆసక్తికరమైన అంశం చుట్టూ ఈ కథ నడుస్తుంది. అందం కోసం .. ఆస్తుల కోసం తనకి ఎరవేసిన వారి బారి నుంచి తప్పించుకున్న ఒక యువతి, ఒక అనాథ యువకుడిని నమ్మి పెళ్లి చేసుకుంటుంది. అయితే అనుకోకుండా ఈ కొత్త జంట ఒక ఉచ్చులో చిక్కుకుంటుంది. అందులో నుంచి బయటపడటానికి వాళ్లు ఏం చేస్తారు? ఎలా చేస్తారు? అనే ఆసక్తికరమైన మలుపులతో ఈ కథను అల్లుకుంటూ వెళ్లారు. ఈ కథలో .. పదవి కోసం కూతురికి వయసుమళ్లిన వ్యక్తితో పెళ్లి చేయడానికి సిద్ధపడిన జానకి తండ్రి ఒక విలన్ గా కనిపిస్తాడు. ఆస్తిపాస్తుల కోసం జానకి చుట్టూ వల పన్నడానికి ప్రయత్నించిన రణేశ్ మరో విలన్ గా అనిపిస్తాడు. ఇక కొత్త జంటల శృంగార సన్నివేశాలను రహస్యంగా చిత్రీకరించి, సొమ్ము చేసుకునే అసలైన ప్రతినాయకుడిగా చక్రవర్తి కనిపిస్తాడు. నిజానికీ ఈ మూడు ట్రాకులు ఆసక్తికరమైనవే. కానీ తెరపై వాటి ఆవిష్కరణ ఉత్కంఠభరితంగా జరగలేదని అనిపిస్తుంది. హీరో – హీరోయిన్ మధ్య ప్రేమ కుదరడానికీ .. ముదరడానికే ఎన్నో రకాల సన్నివేశాలను డిజైన్ చేసుకోవచ్చు. కానీ అలాంటి కొత్తదనంతో పనిలేకుండా .. వాళ్ల ప్రేమాయణం మొదలవకుండానే పెళ్లైపోతుంది. హీరో గతం తాలుకు పరిస్థితులు .. హీరోయిన్ .. ఆమె తండ్రి, హీరోయిన్ ఆమె బాయ్ ఫ్రెండ్ .. హీరో – విలన్ .. ఈ పాత్రల మధ్య బలమైన ఘర్షణ .. సంఘర్షణకి అవకాశం ఉంది. కానీ దర్శకుడు ఆ విషయాలను గురించి పెద్దగా పట్టించుకోలేదు. ఆఫీసులో తనకి రావలసిన ప్రమోషన్ ను కొట్టేసిన హీరోపై అక్కసు చూపించే పాత్రలో యోగిబాబుతో మంచి కామెడీని క్రియేట్ చేయవచ్చు. కానీ ఆ పాత్ర కూడా చప్పగా సాగుతూ, ఉత్సాహంతో ఎదురుచూస్తున్న ప్రేక్షకులను నీరు గార్చేస్తూ ఉంటుంది. కథ ఏదైనా క్లైమాక్స్ లో కాస్త హడావిడి చేయడం సాధారణమైన విషయమే కాబట్టి, అలాంటి ఒక హడావిడి ఇందులోనూ కనిపిస్తుంది. కాకపోతే ఇది కూడా ప్రభావితం చేయలేకపోతోంది. రిచర్డ్ ఫొటోగ్రఫీ .. డార్లింగ్ రిచర్డ్ సన్ ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయి. గిరీశ్ గోపాలకృష్ణన్ నేపథ్య సంగీతం, సన్నివేశాలతో .. సందర్భాలతో సంబంధం లేకుండా కొనసాగుతుంది. ఇక నటీనటుల నటన గురించి చెప్పుకునే స్థాయిలో వాళ్ల పాత్రలను డిజైన్ చేయలేదు. లవ్ .. రొమాన్స్ .. కామెడీ .. యాక్షన్ .. ఇలా ఏ కోణం లో నుంచి చూసినా మెప్పించ లేకపోయిన కంటెంట్ గా ఈ సినిమాను గురించి చెప్పుకోవలసి ఉంటుంది.

# ‘పెద్ది’ సినిమాలో గ్లామర్ అరాచకం



మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా నటించిన తాజా స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ‘పెద్ది’ బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో దూసుకుపోతున్నప్పటికీ.. సినిమాలో హీరోయిన్ పాత్రను చూపించిన విధానంపై సోషల్ మీడియాలో తీవ్రస్థాయిలో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. సినిమాలో హీరోయిన్ జాన్వీ కపూర్ (అచ్చియమ్మ పాత్ర)ను కేవలం గ్లామర్ వస్తువుగా, అత్యంత అసభ్యకరమైన కెమెరా యాంగిల్స్‌తో చూపించారంటూ ప్రేక్షకులు మండిపడుతున్నారు. ఈ వివాదం నడుస్తుండగానే.. గతంలో హైపర్‌సెక్సువలైజేషన్, మహిళల అంగీకారంపై జాన్వీ కపూర్ చేసిన పాత ఇంటర్వ్యూ వ్యాఖ్యలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. జూన్ 4న విడుదలైన ‘పెద్ది’ సినిమాలో రామ్ చరణ్ నటన, ఏఆర్ రెహమాన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌కు మంచి మార్కులు పడినప్పటికీ.. లవ్ ట్రాక్, హీరోయిన్ పాత్ర రాసిన విధానంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా ఒక సీన్‌లో హీరో ఆమె కళ్లు, పెదాలను వర్ణిస్తుంటే.. కెమెరా మాత్రం ఆమె ఎద భాగం, నడుమును క్లోజప్‌లో చూపించడంపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. “కళ్లు, పెదాలు అంటే ఏంటో తెలియని అంత క్లూలెస్ ఎడిటరా మీరు?” అంటూ నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. ఈ బ్యాక్‌లాష్ మధ్య, గత ఏప్రిల్‌లో రాజ్ శమాని పాడ్‌కాస్ట్‌లో జాన్వీ కపూర్ మాట్లాడిన వీడియో క్లిప్ తెరపైకి వచ్చింది. “నా ప్రమేయం లేదా అంగీకారం లేకుండా నన్ను కేవలం సెక్సువలైజ్డ్ (లైంగిక వస్తువుగా) మార్చడాన్ని నేను అస్సలు అంగీకరించను. అది నా వ్యక్తిగత పరిధిని ఉల్లంఘించడమే. సెట్స్‌లో ఉన్నప్పుడు ‘ఇది కుదరదు’ (యే నహీ చలేగా) అని మన సరిహద్దులను గట్టిగా చెప్పగలగాలి” అని జాన్వీ ఆ ఇంటర్వ్యూలో పేర్కొంది. ఈ పాత వ్యాఖ్యలను ఇప్పుడు ‘పెద్ది’ సినిమా సీన్లతో పోలుస్తూ నెటిజన్లు మేకర్స్‌ను కడిగిపారేస్తున్నారు. మరోవైపు, ఇన్స్టాగ్రామ్‌లో “భారతీయ సినిమాలో ఒక లీడ్ హీరోయిన్‌కు జరిగిన అత్యంత ఖరీదైన అవమానం ‘పెద్ది’” అంటూ వచ్చిన ఒక సుదీర్ఘమైన పోస్ట్‌ను స్వయంగా జాన్వీ కపూర్ ‘లైక్’ చేయడం విశేషం.

పోస్ట్ ప్రొడక్షన్ సమయంలో ఈ సీన్ల గురించి జాన్వీ అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ.. డైరెక్టర్ బాక్సాఫీస్ నంబర్ల కోసం ఆమె అంగీకారాన్ని పక్కనపెట్టి ఫైనల్ ఎడిట్‌లో ఆ సీన్లను ఉంచేశారని ఆ పోస్ట్‌లో రాశారు. దీనిని జాన్వీ లైక్ చేయడంతో ఆమె కూడా దర్శకుడిపై అసంతృప్తితో ఉందనే విషయం స్పష్టమైంది. ఈ వివాదంపై దర్శకుడు బుచ్చిబాబు స్పందిస్తూ.. ప్రేక్షకుల నుంచి ఈ స్థాయిలో వ్యతిరేకత వస్తుందని తాను అస్సలు ఊహించలేదని అంగీకరించారు. “మేము స్క్రీన్‌పై చూపించాలనుకున్న రొమాన్స్ ట్రాక్ వేరు.. కానీ అది థియేటర్లలో ప్రేక్షకులకు వేరేలా కన్పించి అసౌకర్యాన్ని కలిగించింది. భవిష్యత్తులో మహిళల పాత్రలను చూపించేటప్పుడు మరింత జాగ్రత్తగా, సెన్సిటివ్‌గా వ్యవహరిస్తాం” అని ఆయన పేర్కొన్నారు.

# ‘పెద్ది’ వివాదం..

## సినిమాల ప్రభావంపై నటి అనసూయ సంచలన వ్యాఖ్యలు!



రామ్ చరణ్, బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వచ్చిన ‘పెద్ది’ సినిమా ఇటీవల వివాదంగా మారిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ పాత్రను కేవలం గ్లామర్ కోసమే వాడరంటూ పెద్ది చిత్రయూనిట్‌పై విమర్శలు వస్తున్నాయి. అయితే ఈ వివాదంపై ప్రముఖ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ పరోక్షంగా స్పందించింది. సినిమా అనేది సమాజానికి ప్రతిబింబం మాత్రమేనని సమాజాన్ని మార్చాల్సిన పూర్తి బాధ్యత సినిమాలపైనే పెట్టకూడదని అనసూయ అన్నారు. సినిమాలో ఏది మంచి, ఏది చెడు అని తెలుసుకునే తెలివి ప్రేక్షకులకు ఉండాలని.. సినిమాలను చూసి పిల్లలను పెంచడం కరెక్ట్ కాదని ఆమె చెప్పారు. అదే సమయంలో, కథలు రాసే రచయితలు, దర్శకులు కూడా తమ బాధ్యతను మర్చిపోకూడదని.. ఎందుకంటే సమాజంలో ప్రజల ఆలోచనలను, ప్రవర్తనను మార్చే శక్తి సినిమాకు ఖచ్చితంగా ఉందని గుర్తుచేశారు. ఒకప్పుడు సినిమాల్లో హీరో అంటే మంచివాడని, విలన్ అంటే చెడ్డవాడని అందరికీ స్పష్టంగా తెలిసేదని.. కానీ ఈ రోజుల్లో పాత్రలు చాలా గందరగోళంగా మారిపోయాయని ఆమె ఆందోళన పడ్డారు. సినిమాలో ఒక చెడును కేవలం చూపించారా? లేక ఆ చెడునే గొప్పగా చేసి చూపించారా? అనే తేడా ప్రేక్షకులకు అర్థం కాకుండా పోతోందని అన్నారు. తాను ఇలాంటి విషయాలపై మాట్లాడినప్పుడు కొందరు తనను తప్పుబడుతుంటారని.. కానీ తన ఉద్దేశం సినిమాలను ఆపడం కాదని, సమాజం పట్ల అందరికీ ఒక బాధ్యత ఉండాలనేదే తన తాపత్రయమని చెప్పారు. సినిమా తీసేవాళ్లకు, చూసేవాళ్లకు అందరికీ ఈ బాధ్యత వర్తిస్తుందన్నారు. తాను ఎప్పుడూ ఇలాంటి సిద్ధాంతాలనే నమ్ముతానని.. గతంలో ఒక పెద్ద టీవీ షో నుండి తప్పుకోవడానికి కూడా ఇదే కారణమని అనసూయ చెప్పారు. తన అభిప్రాయాల వల్ల షో టీమ్ క్రియేటివిటీ దెబ్బతింటుందని కొందరు అన్నారని.. ఆ తర్వాత ఇండస్ట్రీలో తనకు టాలెంట్ ఉన్నా కూడా సరైన అవకాశాలు రాక ఎన్నో ఇబ్బందులు పడ్డానని తెలిపారు. అయినా సరే తాను నమ్మిన నిజం కోసం నిలబడటంలో ఎప్పుడూ వెనకడుగు వేయలేదని స్పష్టం చేశారు. సినిమాల్లోని తప్పులను ఎత్తిచూపుతూ సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్న నెటిజన్లను ఆమె మెచ్చుకున్నారు. తప్పును ప్రశ్నించడం అంటే సినిమా స్వేచ్ఛను అడ్డుకోవడం కాదని, అది సమాజంలో ఒక మంచి మార్పుకు దారితీస్తుందని చెప్పారు. సినిమా తీసే స్వేచ్ఛ ఎంత ముఖ్యమో, సమాజం పట్ల బాధ్యత కూడా అంతే ముఖ్యమని.. ఇకనైనా సినిమా వాళ్లు, చూసే ప్రేక్షకులు అందరూ మరింత బాధ్యతగా ఉంటారని ఆశిస్తున్నట్లు అనసూయ చెప్పారు.

# జెన్‌జీ ప్రేమకథగా మొహబ్బత్



సంతోష్ కల్వచర్ల, శ్రేయాసి సేన్ జంటగా రూపొందుతున్న యువతరం ప్రేమకథ ‘మొహబ్బత్’. మ్యాక్ దర్శకత్వంలో అఫ్రోజ్ షేక్ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభోత్సవం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది.

ముహూర్తపు సన్నివేశానికి శాసనసభ్యుడు నవీన్ యాదవ్ క్లాప్‌నివ్వగా, చిత్రనిర్మాత అఫ్రోజ్ షేక్ కెమెరా స్విచాన్ చేశారు. నవీన్ యాదవ్, చిన్న శ్రీశైలం యాదవ్ సినిమాకు సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని లాంచ్ చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. ఎమోషనల్ యూత్‌ఫుల్ జెన్‌జీ సినిమా ఇదని దర్శకుడు మ్యాక్ తెలిపారు. నిర్మాతగా తన తొలి ప్రయత్నం తప్పక సఫలం అవుతుందనే నమ్మకాన్ని నిర్మాత అఫ్రోజ్ షేక్ వ్యక్తం చేశారు. ఇంకా హీరోహీరోయిన్లతో పాటు రచయిత కలాం కూడా మాట్లాడారు. అజయ్ ఘోష్, సాత్విక్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: వైఎస్ కృష్ణ, సంగీతం: సునీల్ కశ్యప్, నిర్మాణం: ఏబీఎస్ ప్రొడక్షన్స్.

# అదే అలవాటుగా మారింది!



వింత పోకడలు, విచిత్రమైన అభిరుచులు మనుషుల్లో కామన్. బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్ ఆహారపు అలవాట్లు వింటే మరీ విడ్డూరం అనిపించక మానదు. ఈ ముద్దుగుమ్మ అన్నంలో ఐస్‌క్రీమ్ కలుపుకొని తింటుందట. ఇటీవల ఓ ఇంటర్‌వ్యూలో ఈ విషయాన్ని తానే స్వయంగా చెప్పింది. ‘ఈ అలవాటు నా ఫ్రెండ్ నుంచి నాకు వచ్చింది. తను ఓ సారి రైస్‌లో ఐస్‌క్రీమ్ కలుపుకొని తినడం చూశాను. చూసిన దాన్ని చూసినట్టుగా ఉండక, ఇంటికెళ్లి ట్రై చేశాను. నిజం చెబుతున్నాను.. ఆ టేస్ట్ చాలా కొత్తగా అనిపించింది. నిదానంగా అది అలవాటుగా మారింది. నాకు నచ్చిందని అందరికీ నచ్చాలని లేదు’ అంటూ చెప్పుకొచ్చింది మృణాల్ ఠాకూర్. ఇది విన్నవారంతా ‘అన్నంలో ఐస్‌క్రీమ్ కలుపుకొని తినడమేంటి?.. పిచ్చికాకపోతే..’ అంటూ కామెంట్లు పెడుతున్నారు. కొందరైతే.. ‘ట్రై చేస్తే తప్పేంటి?’ అని కూడా అంటున్నారు. జిహ్వాకో రుచి, పుర్రెకో బుద్ధి అని ఊరికే అనలేదు!

## మహిళా సాధికారత లక్ష్యం దిశగా బీ.ఎన్.రావు ఫౌండేషన్ కృషి

**- రామడుగులో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం**



రామడుగు (ప్రశ్న న్యూస్) పేద మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో డాక్టర్ బి.ఎన్. రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామడుగు మండల కేంద్రంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ బి.ఎన్. రావు ఈ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, పేద మహిళలు స్వయం ఉపాధి సాధించి ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఈ శిక్షణ కేంద్రం దోహదపడుతుందని తెలిపారు. శిక్షణ ద్వారా మహిళలు కుట్టు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని తమ కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవచ్చని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ సమాజంలో తమ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఏసీ ట్రైనింగ్ టీచర్ త్రివేణి, అరేపల్లి వినోద్,మండల స్థాయి మాజీ సర్పంచ్ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొని శిక్షణ కేంద్రం ప్రారంభాన్ని అభినందించారు. రామడుగు మండలంతో పాటు పరిసర గ్రామాల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

## కరాటే శిక్షణతో స్వీయ రక్షణలో విద్యార్థులు ముందుండాలి

**- మున్సిపల్ చైర్మన్ : పుల్కం రాజు**

**- కరాటే శిక్షణ పొందిన విద్యార్థులకు బెల్టుల ప్రదానం**




వేములవాడ (ప్రశ్న న్యూస్) విద్యార్థులు చదువుతో పాటు స్వీయ రక్షణ నైపుణ్యాలను కూడా అలవరచుకోవాలని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు సూచించారు. పట్టణంలోని మహా లింగేశ్వర గార్డెన్‌లో ఒకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో, చీఫ్ ఎగ్జామినర్ సీనియర్ మాస్టర్ అబ్దుల్ మన్నన్ నిర్వహించిన కరాటే బెల్ట్ ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.వేసవి శిక్షణ పూర్తి చేసి తదుపరి స్థాయికి అర్హత సాధించిన విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేసి అభినందించారు. కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ధైర్యసాహసాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించి వేములవాడకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అవధూత రజినీకాంత్, కో-ఆప్షన్ సభ్యుడు పీర్ మహమ్మద్, సీపీఐ నాయకుడు గుంటి వేణు, కరాటే శిక్షకులు లోలోపు రాజు, దండుగుల శంకర్, పి. భాస్కర్, బి. శ్యామ్‌కుమార్, విద్యార్థులు, తల్లిదండ్రులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు : జోగినిపల్లి రవీందర్ రావు**

**- గ్రీన్ ఇండియా ఛాలెంజ్ స్ఫూర్తితో ఘనంగా జోగినిపల్లి రవీందర్ రావు జన్మదిన వేడుకలు**



కరీంనగర్ / బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శ్రీపురం కాలనీలో తన జన్మదిన వేడుకలను పురస్కరించుకొని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్ రావు పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా మొక్క నాటారు. మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరిత సేన కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ముందుగా స్థానిక శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన రవీందర్ రావు, అనంతరం ఆలయ ఆవరణలో చొప్పదండి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్,బోయినిపల్లి మండల నాయకులతో కలిసి మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే హరితహారం వంటి కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కత్తెరపాక కొండయ్య, ప్రధాన కార్యదర్శులు కొనుకటి నాగయ్య,గుంటి శంకర్,నాయకులు అనుముల భాస్కర్,మెడుదుల మల్లేశం, నిమ్మ శ్రీనివాస్ రెడ్డి,చిందం రమేష్,అక్కెనపల్లి కర్ణాకర్, ముద్దం రవీందర్ గౌడ్,కమల్ గౌడ్, భీమనాథుని రమేష్, బోయిని రాజు, కన్నం సాగర్, నల్లగొండ అనిల్, కట్ట లింగయ్య, ముందు కమలాకర్, తుంటి మధుకర్, పొన్నం తిరుపతి, వినీష్ తదితరులు పాల్గొని రాష్ట్ర నేత రవీందర్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్

**- మహిపాల్ కుటుంబానికి పోలీసు శాఖ అండగా ఉంటుంది**

**- అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్,**

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) నిన్న రాత్రి విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో శివంపేట్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ మహిపాల్ రోడ్డు ప్రమాదంలో లారీని ఢీకొనడంతో దురదృష్టవశాత్తు మృతి చెందారు. జరిగిన ఈ విషాద ఘటన జిల్లా పోలీసు శాఖను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. మహిపాల్ 2024లో పోలీసు శాఖలో చేరి, సుమారు సంవత్సరం పాటు క్యూఆర్టీ (క్యూ ఆర్టీ) లో విధులు నిర్వహించారు. అనంతరం కొద్ది రోజుల క్రితమే బదిలీపై శివంపేట్ పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. తన స్వల్ప సేవా కాలంలోనే అంకితభావం, క్రమశిక్షణ, విధి నిర్వహణలో నిబద్ధతతో సహచరుల అభిమానాన్ని సంపాదించారు. విషయం తెలుసుకున్న మెదక్ జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాస రావు, అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, మహిపాల్ స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను ఓదార్చి, ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. మహిపాల్ అకాల మరణం పోలీసు శాఖకు తీరని లోటని అధికారులు, సిబ్బంది పేర్కొన్నారు.

విధి నిర్వహణలో ఆయన చూపిన కర్తవ్యనిష్ఠను స్మరించుకుంటూ నివాళులర్పించారు. భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని, ఈ తీవ్ర విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ప్రార్థిస్తూ తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.



## పేద ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ

**చేసిన మెదక్ నియోజకవర్గ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) శనివారం చిన్న శంకరంపేట్ మండలంలోరాదేశాం ఫంక్షన్ హాల్‌లో మండలంలోని లబ్ధిదారులకు మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మొత్తం 115 మంది లబ్ధిదారులకు రూ.1,05,12,480/- కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ, “రాష్ట్ర ప్రభుత్వం పేద ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. లబ్ధిదారులందరూ ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి” అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## చార్మినార్ జోనల్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన కన్నం సత్యనారాయణ గంగపుత్ర

**సత్కరించిన తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జిహెచ్ఎంసి పరిధిలోని చార్మినార్ జోనల్ కమిషనర్ గా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన కన్నం సత్యనారాయణ గంగపుత్రను మర్యాదపూర్వకంగా కలసిన తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర చార్మినార్ జోనల్ కమిషనర్ కన్నం సత్యనారాయణ గంగపుత్రకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుతూ కన్నం సత్యనారాయణ గంగపుత్ర నిరుపేద సంప్రదాయ మత్యకార కులములో జన్మించి ఈ స్థాయికి ఎదగడం శుభపరిణామన్నారు. సత్యనారాయణ గంగపుత్ర రానున్న రోజులలో సామాజిక కార్యక్రమాలతో పాటు వయో వృద్ధులు, ప్రతిభ కలిగిన నిరుపేద గంగపుత్ర విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తూ మరింత ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాటాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**- జనగాం మాజీ ఎమ్మెల్యే,సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు**

**: సీ.హెచ్. రాజారెడ్డి**




వేములవాడ (ప్రశ్న న్యూస్) దోపిడీ వ్యవస్థ ఉన్నంతకాలం కమ్యూనిస్టుల పోరాటాలు కొనసాగుతాయని జనగాం మాజీ ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీ.హెచ్. రాజారెడ్డి అన్నారు.వేములవాడలోని మహానందీశ్వర బంకెట్ హాల్‌లో నిర్వహించిన సీపీఐ రాజకీయ శిక్షణా శిబిరం రెండో రోజు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.శిబిరాలకు చెన్న విశ్వనాథం,గోషిక మోహన్ ప్రిన్సిపల్స్‌గా వ్యవహరించారు. పార్టీ కార్యక్రమం అంశంపై సీ.హెచ్. రాజారెడ్డి,కులం--వర్గం--సామాజిక న్యాయంపై యూసఫ్, భారత స్వాతంత్ర్యోద్యమంలో సీపీఐ పాత్రపై జమ్ముల జితేందర్ రెడ్డి, మతం--మతోన్మాదం--లౌకికవాదంపై ఉమా మహేష్ తరగతులు నిర్వహించారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందని, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజలపై భారం మోపిందని రాజారెడ్డి విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టులు నిరంతరం ఉద్యమాలు చేపట్టాలని, రాజకీయ శిక్షణా తరగతులు కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో పంజాల శ్రీనివాస్, తాండ్ర సదానందం, మంద సుదర్శన్, చెన్న విశ్వనాథం, కడారి రాములుతో పాటు కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల సీపీఐ నాయకులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

## వరి పంట పండించడమే పాపమా ఓ దేవుడా...

**లారీలు రాకపోవడంతోనే తమ వడ్లు వెళ్లడం లేదని రోడ్లపై ధర్నాలు**

**కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల కన్నీటి పర్యంతం.**

**చిన్నగనాపూర్ గ్రామ ప్రజలు లారీల కోసం ధర్నా**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) రైతులు ఆరుగాలం కష్టపడి చమట నీరు గారి పోతుంటే రైతాంగము కన్నీటి పర్యంతం చెందుతుంది. అధికారుల అలసత్వం పై ఆగ్రహించిన రైతులు రోడ్ ఎక్కవలసిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. పంటలు పండించడమే పాపమా దేవుడా... కొల్చారం మండలంలోని చిన్నగనాపూర్ ప్రాథమిక సొసైటీ ముందు మెదక్ సంగారెడ్డి ప్రధాన రహదారిపై గ్రామ రైతులు లారీల కోసం శనివారం ఉదయం ధర్నా చేశారు. ఓవైపు వర్షాలు మరోవైపు లారీల కొరత ఇదేం గోస అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తాము వరి పంట పండించడమే పాపమా దేవుడా అంటూ వారి బాధను వెల్లబోసుకున్నారు. వరి పంటను కోసి రెండు నెలలు అవుతున్నప్పటికీ కూడా ఇప్పటివరకు ధాన్యము కొనుగోలు వద్ద, లారీలు లేక తూకం వేయడం లేదని తూకం వేసిన మూడువేల బస్తాలు ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లారీలు రాక ఒక తిప్పలు సాయంత్రం అయితే చాలు గుండె పగిలేలా బాధపడుతున్నామంటూ రైతులు తెలిపారు. ధర్నా చేసిన విషయము తెలుసుకున్న కొల్చారం ఎస్సై చిన్న ఘనాపూర్ గ్రామానికి చేరుకుని రైతులను శాంతించే ప్రయత్నం చేయగా రైతులు మాత్రం ఏ మాత్రం తగ్గకుండా రోడ్డుపైనే కూర్చున్నారు. వెంటనే ఎస్సై కొల్చారం తహసిల్దార్ తో మాట్లాడుతానని మీ సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటానని అలాగే అన్లోడింగ్ అయ్యేలా లారీలు వచ్చేలా చూస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మంద నాగయ్య, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు బొబ్బిలి సందీప్ కుమార్, డైరెక్టర్ సోమ నర్సింలు, మాజీ వార్డు మెంబర్ కమ్మరి మల్లేశం, వడ్ల ఉదయ్ కిరణ్ రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చెత్త సేకరణ పేరిట ప్రజలపై అదనపు భారం వద్దు

**ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలి: బీజేపీ**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) ఇప్పటికే పన్నులు, నల్లా బిల్లులు, ఇతర సేవల ఛార్జీలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై చెత్త సేకరణ పేరుతో మరో భారం మోపడం అన్యాయమని గజ్వేల్ బీజేపీ నాయకులు విమర్శించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో చెత్త సేకరణ బాధ్యతలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బీజేపీ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షుడు మనోహర్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన మున్సిపల్ శాఖ, ప్రైవేటీకరణ పేరుతో అదనపు ఆర్థిక భారం మోపడం సరికాదన్నారు. మున్సిపల్ పరిధిలో అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నాయని, వాటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.తూప్రాన్ రోడ్డులో ఉన్న కోట్ల రూపాయల విలువైన మున్సిపల్ భూములను పరిరక్షించి స్వాధీనం చేసుకోవాలని, ప్రజ్ఞాపూర్ ఆర్ అండ్ ఆర్ కాలనీలో స్మశానవాటిక ఏర్పాటు కోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా చెత్త సేకరణ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకుని ప్రజలపై అదనపు భారం పడకుండా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పేర్ల శ్రీనివాస్, నాయిని సందీప్, వెంకట్ రెడ్డి, మంద వెంకటేష్, మడుగు నరసింహ, నాగు ముదిరాజ్, లింగంపల్లి హరికుమార్, జోడు ప్రకాష్, పిట్ల శ్రీనివాస్, సాయి,తదితరులు పాల్గొన్నారు.

## అనుముల భాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా జోగినిపల్లి బర్త్‌డే సెలబ్రేషన్స్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు శనివారం కరీంనగర్‌లోని శ్రీపురం కాలనీలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్ రావు నివాసాన్ని సందర్శించారు. ఆయన జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కేక్ కట్ చేయించి, పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ అనుముల భాస్కర్ మాట్లాడుతూ, జోగినిపల్లి రవీందర్ రావు పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తూ కార్యకర్తలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో, ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహేశ్వరంలో ప్రభుత్వ భూములపై మట్టి మాఫియా దందా

- రాత్రివేళల్లో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- కోట్ల విలువైన ప్రభుత్వ సంపదను కొల్లగొడుతున్న మాఫియా
- రెవెన్యూ, మైనింగ్ అధికారులపై తీవ్ర అనుమానాలు
- వందల లారీల సంచారం.. పోలీసులకు కనిపించలేదా.?





మహేశ్వరం (ప్రశ్న న్యూస్) మహేశ్వరం మండలంలో ప్రభుత్వ భూములు మట్టి మాఫియాకు అడ్డాగా మారాయనే ఆరోపణలు తీవ్ర స్థాయిలో వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికుల కథనం ప్రకారం ఇండస్ట్రియల్ ఏరియా వెనుక భాగంలో ఉన్న కమ్మగుట్ట పరిసరాల్లోని సర్వే నంబర్ 65తో పాటు డబుల్ బెడ్ రూమ్ కాలనీ పక్కకు సర్వే నంబర్ 461లో భారీ ఎత్తున మట్టి అక్రమ



తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. ప్రతిరోజూ రాత్రి దాదాపు 8 గంటల నుంచి తెల్లవారుజామున 6 గంటల వరకు మట్టి మాఫియా యథేచ్ఛగా తవ్వకాలు నిర్వహిస్తూ వందలాది లారీల ద్వారా మట్టిని తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కొన్ని సంవత్సరాలుగా ఈ వ్యవహారం కొనసాగుతున్నప్పటికీ సంబంధిత శాఖలు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ భూముల్లో జరుగుతున్న ఈ అక్రమ దందా వల్ల ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం నష్టం జరుగుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన రెవెన్యూ శాఖ అధికారులు, అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవాల్సిన మైనింగ్ శాఖ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారన్న ప్రశ్నలు



ఉత్పన్నమవుతున్నాయి. మహేశ్వరం మండల ఎమ్మార్వో, ఆర్ఐ, జీపీఓలు ఈ వ్యవహారంపై ఎందుకు స్పందించడం లేదని స్థానికులు నిలదీస్తున్నారు. ఇది అధికారుల బాధ్యతారాహిత్యమా? లేక అక్రమార్కులతో కుమ్మక్కై వ్యవహరిస్తున్నారా. ? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంత భారీ స్థాయిలో మట్టి తవ్వకాలు జరుగుతుంటే సంబంధిత శాఖలకు సమాచారం లేకపోవడం సాధ్యమేనా అనే ప్రశ్న కూడా వినిపిస్తోంది. రాత్రిపూట వందల సంఖ్యలో లారీలు రహదారులపై తిరుగుతున్నప్పటికీ పోలీసుల దృష్టికి రాకపోవడం పట్ల స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. చట్టవిరుద్ధంగా జరుగుతున్న ఈ కార్యకలాపాలపై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. అక్రమ మట్టి తవ్వకాల కారణంగా భూభాగ స్వరూపం మారిపోవడంతో పాటు భవిష్యత్తులో పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, పెద్ద పెద్ద చెట్లను సైతం కనుమరుగు చేస్తున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ భూములు క్రమంగా ఖాళీ అవుతుండగా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మహేశ్వరంలో జరుగుతున్న ఈ అక్రమ మట్టి దందాపై జిల్లా ఉన్నతాధికారులు, విజిలెన్స్, మైనింగ్ శాఖ ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూములను దోచుకుంటున్న మాఫియాపై కఠిన చర్యలు తీసుకుని ప్రజా సంపదను కాపాడాలని కోరుతున్నారు. అక్రమ తవ్వకాల వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు.? అధికారుల పాత్ర ఏమిటి.? అనే అంశాలపై ఏసీబీ అధికారులచే లోతైన దర్యాప్తు జరిపితేనే అసలు నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మరి దీనిపై రెవిన్యూ, మైనింగ్ శాఖ మంత్రులు, జిల్లా కలెక్టర్ ఏలా స్పందిస్తారో వేచి చూడాలి.

# కీసర మండలంలో పెట్రోల్ బాంబుల కలకలం

- ప్రాణభయంతో వణికిన బాధితులు
- తాతల నాటి భూమిపై కబ్జాకోరు కన్ను, సెక్యూరిటీ గార్డ్‌పై పెట్రోల్ పోసి దాడి
- ఖాకీల అండతోనే బరితెగింపా.? ఆసుపత్రి బెడ్‌పై నుంచి బాధితుల కన్నీటి రోదన

కీసర(ప్రశ్న న్యూస్) శాంతిభద్రతలకు నిలయంగా ఉండాల్సిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర సర్కిల్ పరిధిలోని చీర్యాలలో అర్ధరాత్రి వేళ రౌడీమూకలు స్వైరవిహారం చేశాయి. సినిమా ఫక్కీని తలపిస్తూ.. సుమారు 50 మంది రౌడీ షీటర్లు, గుండాలతో వచ్చి ఓ సామాన్య దంపతులపై అమానుషంగా దాడి చేసి, భూమిని గుంజుకునేందుకు ప్రయత్నించిన ఘాతుకం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. రౌడీల దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితులు ప్రస్తుతం ఆసుపత్రిలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు.





### స్కెచ్ వేసి.. సరిహద్దులు దాటి

బాధితులు కోళ్ల రమేష్, పారిజాతల కథనం ప్రకారం.. చీర్యాలలోని సర్వే నంబర్ 156లో వారికి ఒక ఎకరా 37 గుంటల సొంత భూమి ఉంది. ఇది వారి తాతల కాలం నాటి వారసత్వ ఆస్తి. అయితే వీరి భూమి పక్కనే కొంత స్థలం కొనుగోలు చేసిన పల్లె భద్రారెడ్డి అనే వ్యక్తి కన్ను ఈ విలువైన భూమిపై పడింది. "ఈ భూమి కూడా నాదే" అంటూ గత కొంతకాలంగా రమేష్ కుటుంబంపై భద్రారెడ్డి కక్షగట్టాడు. ఈ క్రమంలోనే గతరాత్రి కాపుకాసిన భద్రారెడ్డి, పక్కా ప్లాన్ ప్రకారం 50 మంది గుండాలను రప్పించి అర్ధరాత్రి వేళ భూమిపైకి ఉసిగొల్పాడు. అక్కడ ప్రహరీ గోడ నిర్మిస్తున్న రమేష్, పారిజాతలపై ఆ మూకలు ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. ఇనుప రాడ్లు, కర్రలతో దంపతులను ఇష్ట రాజ్యాంగ చితకబాదారు.



### పెట్రోల్ పోసి సజీవ దహనానికి యత్నం..

రౌడీల బరితెగింపు అక్కడితో ఆగలేదు. ఆ భూమికి కాపలాగా ఉంటూ అక్కడ ఒక కంటైనర్‌లో నిద్రిస్తున్న సెక్యూరిటీ గార్డ్ 'సాయి'ని చంపేందుకు సైతం వెనుకాడలేదు. కంటైనర్ గోడ దూకి లోపలికి ప్రవేశించిన దుండగులు, లోపల పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు ప్రయత్నించారు. ప్రాణభయంతో సాయి గట్టిగా కేకలు వేస్తూ బయటకు రాగా అతడిని చుట్టుముట్టి రక్తం వచ్చేలా పశువును బాదినట్లు బాధని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం బాధితులు నాగారంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రి ఐసీయూ లో చికిత్స పొందుతున్నారు.

### సీపీ ఆర్డర్స్‌కే దిక్కులేదు.. పోలీసుల అండ ఎవరికి.?

ఈ భూ వివాదంపై 2020 నుంచి కోర్టులో పోరాటం నడుస్తోంది. 2025లో కూడా భద్రారెడ్డి కబ్జాకు ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు (ఎమ్మార్వో, ఆర్డీవో) పూర్తి స్థాయి నివేదికను పోలీసులకు సమర్పించారు. ఆ రిపోర్టు ఆధారంగా "వివాదం తేలేవరకు ఎవరి భూమిలో వారే ఉండాలి" అని స్వయంగా పోలీస్ కమిషనర్ (సీపీ) ఇరు వర్గాలకు కఠిన ఆదేశాలు ఇచ్చారు. కానీ సీపీ ఆదేశాలను బూట్ల కాలితో తొక్కుతున్నట్లుగా భద్రారెడ్డి వ్యవహారం మారిందని అర్ధరాత్రి దాడికి తెగబడటం వెనుక పెద్దల హస్తం ఉందనే ఆరోపణలు గ్రామంలో వినిపిస్తున్నాయి.

### రక్షించాల్సిన వారే భక్షిస్తారా.? బాధితుల కన్నీటి సుడులు

"మేము చచ్చిపోయాక మా భూమి ఇస్తారా సార్.? రౌడీలు మాపై పడి కొడుతుంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పోలీసులకు ఫోన్ చేశాం. కానీ కీసర పోలీసులు కబ్జాదారులకే వత్తాసు పలుకుతున్నారు. దాడి జరిగిన తర్వాత పోలీస్ స్టేషన్‌కు వెళ్తే.. 'మాకు చెప్పకుండా ఆసుపత్రికి ఎందుకు వెళ్లారు.?' అంటూ మమ్మల్నే పోలీసులు బెదిరిస్తున్నారు. మాకు న్యాయం జరగకపోతే సీఎం ఆఫీస్ ముందే ఆత్మహత్య చేసుకుంటాం అంటూ బాధితులు కమిషనర్ కు విన్నవించుకుంటున్నారు. రాజకీయ అండతో ప్రజల భూములను లాక్కోవడం దానికి అధికారులు తోడు కావడం అత్యంత దారుణమని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**-- కోళ్ల రమేష్, పారిజాత (బాధితులు)**

### కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

ఈ దారుణ ఘటనపై మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, బాధితులకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు. భూకబ్జా కోరు పల్లె భద్రారెడ్డితో పాటు దాడికి పాల్పడిన 50 మంది గుండాలపై 'రౌడీషీట్' ఓపెన్ చేసి, వారిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు తీవ్రస్థాయిలో డిమాండ్ చేస్తున్నారు.

# మహిళలకు చీరలు పంపిణీ కాంగ్రెస్ నాయకులు రాజేష్



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో మహిళా మణులకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చీరలు పంపిణీ చేశారు. శనివారం బాలంరాయి,అంబేద్కర్ నగర్, అన్నానగర్, వార్డు 3లో మన మహిళాలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, టి పిసిసి రాజేష్ యాదవ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం మహిళల గౌరవం, సంక్షేమం, సాధికారత పట్ల కాంగ్రెస్ పార్టీ యొక్క నిబద్ధతకు నిదర్శనం అన్నారు.ప్రజా కేంద్రీకృత పాలన, సంక్షేమ విధానాలకు నిరంతరం కృషి చేస్తున్న రాహుల్ గాంధీకి మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి అద్భుత సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, అలాగే ఈ పథకాల ఫలాలు కంటోన్మెంట్ నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి చేరేలా నిరంతరం కృషి చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ కి ధన్యవాదాలు తెలిపారు. ప్రజాసేవతో పాటు మహిళల సంక్షేమం,సాధికారత కోసం నిరంతరం కృషి చేయడం మా సామూహిక బాధ్యతని రాజేష్ యాదవ్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులుమహేష్ యాదవ్ మూడో ఇన్చార్జ్ ,మురళీ, దర్గ రవి, గిరి, శివరాత్రి వినోద్, ఆదిత్య యాదవ్ ఎన్ఎస్ యుఐ కంటోన్మెంట్ తదితరులు పాల్గొన్నారు.

# మంథనిలో మంత్రి గడ్డం వివేక్ దంపతుల పెళ్లిరోజు వేడుకలు ఘనంగా జరిగాయి.



మంథని(, ప్రశ్న న్యూస్) రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ దాంపత్య వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంథని పట్టణంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా మాల మహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాల పోచ మల్లయ్య, మంథని డివిజన్ అధ్యక్షుడు ఎడ్ల కిష్టయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ వద్ద కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి గడ్డం వివేక్ దంపతులు ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాదండి శంకర్, ప్రజా ప్రశ్న స్టాఫ్ రిపోర్టర్ దాసరి రాజేశం, దార మధు, దాసరి ధర్మేందర్, లింగం శంకర్, బేర ధర్మేందర్, జంజర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విలాసాగర్‌లో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక గ్రామసభ



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ గ్రామంలో శనివారం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక, 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. సమావేశంలో పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించాలని, వ్యవసాయ శాఖ సూచించిన మెళకువలు పాటిస్తూ నాణ్యమైన విత్తనాలు వినియోగించాలని అధికారులు సూచించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచడం, గ్రామంలోని పలు మౌలిక సౌకర్యాల అభివృద్ధిపై చర్చించారు. ఈ సమావేశంలో మండల స్థాయి వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచ్ ఏనుగుల కనుకయ్య, ఉప సర్పంచ్ పొత్తూరి శైలజ, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియా పోస్టుపై వివాదం

## కాంగ్రెస్ కార్యకర్తపై దాడి చేసిన బీఆర్ఎస్ కార్యకర్తలు

## నాచారం పోలీస్ స్టేషన్ లో ఇద్దరిపై కేసు నమోదు



నాచారం (ప్రశ్న న్యూస్) ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్‌పై జూన్ 6 శనివారం నాడు దాడి చేసి బెదిరింపులకు పాల్పడ్డారనే ఆరోపణలపై నాచారం పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు.పోలీసుల వివరాల ప్రకారం ఎస్‌వీ నగర్, మల్లాపూర్‌కు చెందిన ఎస్.కే. ఖయ్యూం ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగంతో అనుబంధంగా పనిచేస్తున్నారు. ఉప్పల్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన రాజకీయ ఫ్లెక్సీలకు సంబంధించిన ఫోటోలు, వ్యాఖ్యలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన అనంతరం బీఆర్ఎస్ పార్టీకి చెందిన బుచ్చన్న గౌడ్, వాసు అనే వ్యక్తులు తనకు ఫోన్ చేసి అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డారని ఖయ్యూం ఫిర్యాదులో పేర్కొన్నారు.అంతేకాకుండా వీరారెడ్డి నగర్‌లోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో తనను వెంబడించి చేతులతో దాడి చేశారని ఆరోపించారు. ఫిర్యాదు మేరకు నాచారం పోలీసులు ప్రాథమిక విచారణ నిర్వహించి సంబంధిత ఇద్దరు వ్యక్తులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్లు 341, 323, 504, 506 కింద కేసు నమోదు చేశారు.ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. కాగా ఈ కేసుకు సంబంధించి సోషల్ మీడియాలో అనవసరమైన లేదా తప్పుదారి పట్టించే పోస్టులు చేసే వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588